Follow: @ANNTELUGU
07-03-2025
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్   సంపుటి- 22   సంచిక- 95   పేజీలు-08   వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## రంగంలోకి దిగిన ఏఐసీసీ కార్యదర్శులు



- గాంధీభవన్‌లో 48 మంది సీనియర్లతో భేటీ
- వన్ టు వన్ ప్రశ్నించిన ఏఐసీసీ నేతలు
- నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు

03


## అప్ కీ బార్ చార్ సౌ పార్ అన్నారు ఏమైంది



- ఎమ్మెల్సీ గెలుపుతో విర్రవీగుతున్న బండి సంజయ్
- మోడీ హామీలను అమలు చేయించు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

02

## రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు షాక్



- లగచర్ల, హకీంపేట భూ సేకరణ నోటిఫికేషన్ రద్దు

03

## రాన్యా రావు ఒక్క ట్రిప్‌కు రూ. 13 లక్షల సంపాదన

### హీరోయిన్ తీగలాగితే.. గోల్డ్ సిండికేట్ షేక్




**మహా:** కన్నడ నటి రాన్యారావు అరెస్టు సంచలనంగా మారింది. బెంగళూరు ఎయిర్ పోర్టు నుంచి ఏకంగా దుస్తుల్లో రూ.12కోట్ల విలువైన 14.8 కేజీల బంగారాన్ని తరలిస్తూ పట్టుబడింది. అసలు నటి రాన్యారావు ఎవరు..? ఆమె బ్యాక్ గ్రౌండ్ ఏమిటి? అంతమొత్తంలో తరలిస్తున్న బంగారాన్ని ఎక్కడికి తీసుకెళ్తుంది..? దీని వెనుక పెద్దల హస్తం ఏమైనా ఉందా..? పదిహేను రోజుల వ్యవధిలోనే నాలుగు సార్లు రాన్యారావు ఎందుకు విదేశాలకు వెళ్లాల్సి వచ్చింది.. బంగారం స్మగ్లింగ్ కోసమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, రాన్యారావు కేసులో ఆసక్తికర విషయాలతో పాటు సంచలనం కలిగే నిజాలు కూడా బైటపడుతున్నాయి.

మిగతా 2లో

# కేబినెట్‌లోకి విజయశాంతి?





## కాంగ్రెస్‌లో సంచలన పరిణామాలు

### ఖర్గేను కలిసిన విజయశాంతి.. ఎమ్మెల్సీ ఇవ్వాలని రిక్వెస్ట్

అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించకుండా ప్రచారం చేసిన విజయశాంతి

తెలంగాణ ఉద్యమంలో విజయశాంతి కీ రోల్.. సోనియాగాంధీతో సత్సంబంధాలు

ఎఐసిసి ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్, విజయశాంతి.. ఒకే పీరియడ్ లో ఎంపీలు

అనూహ్యంగా కదులుతున్న పావులు.. ప్రభుత్వ సలహాదారుడిగా జానారెడ్డి?

**హైదరాబాద్, మహా:** తెలంగాణ కాంగ్రెస్ లో సంచలన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చకచకా పావులు కదుపుతుండగా, రాజకీయ రూపం మారిపోతోంది. గత కొద్దిరోజులుగా సైలెంట్ గా ఉన్న ఫైర్ బ్రాండ్ లీడర్ రాములమ్మ అనూహ్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల కదన రంగంలోకి అనూహ్యంగా దూసుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను కలిసిన విజయశాంతి తనకు ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా టికెట్ ఆశించకుండా తాను పనిచేశానని, తాను గతంలో పోటీచేసిన మెదక్ అసెంబ్లీ స్థానం కూడా ఆశించలేదని విజయశాంతి పేర్కొన్నట్లు తెలిసింది. అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను కూడా ఆమె కలవనున్నారు.

మిగతా 2లో

## మీనాక్షి మార్క్

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ప్రచారం కల్పించడం, ప్రతిపక్షాల విమర్శలకు కౌంటర్స్ వేయడం లాంటివి.. విజయశాంతి లాంటి వాళ్లు సమర్ధవంతంగా చేయగలరని ఎఐసిసి ఇన్ ఛార్జి మీనాక్షి భావిస్తున్నారట. దీంతో మళ్లీ పార్టీకి విజయశాంతిని దగ్గర చేసే చర్యలపై దృష్టి పెట్టారనే చర్చ జరుగుతోంది. మీనాక్షి వచ్చిన తర్వాత అనూహ్యంగా విజయశాంతి ఢిల్లీలో ప్రత్యక్షం కావడం హాట్ టాపిక్ గా మారింది.

## 12 నుండి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

### కొత్తగా 10,950 విలేజ్ లెవల్ ఆఫీసర్ పోస్టులు

రెవెన్యూ శాఖ బలోపేతానికి కీలక అడుగు

ఎస్సీ కులాల వర్గీకరణ ముసాయిదా.. బిల్లుకు కేబినెట్ ఆమోదం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ

కీలక నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల హర్షం

ఆరుగంటలకు పైగా మంత్రివర్గ సమావేశం



**హైదరాబాద్, మహా:** ఈనెల 12 నుండి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం నిర్ణయించింది. రెవెన్యూ శాఖ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. చెప్పినట్టుగానే రాష్ట్రంలోని ప్రతి గ్రామానికొక క్షేత్రస్థాయిలో అధికారి ఉండేలా కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

మిగతా 2లో




## సీఎం రేవంత్ సొంతూరు.. కొండారెడ్డిపల్లిలో..

### నర్సయ్య తాత రప్పా..రప్పా

### ఎఎన్ఎన్-మహా ఎక్స్ క్లూజివ్

సీఎంపై సొంతూరు రిపోర్ట్ కార్డ్

జ్ఞాపకాలు.. ఆనందాలు.. ఆశలు



ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక తన స్వగ్రామం కొండారెడ్డిపల్లి గ్రామంలో వచ్చిన మార్పులేంటి? నల్లమల బిడ్డ, తమ మధ్య తిరిగి రాష్ట్రాన్ని పాలిస్తున్న రేవంత్ రెడ్డిపై ప్రజలు ఏమనుకుంటున్నారు? ఏం ఆశిస్తున్నారు? ఎఎన్ఎన్ మహా బృందం కొండారెడ్డిపల్లి ప్రజలను పలకరించింది. సీఎం కాగానే.. గ్రామంలో తెచ్చిన మార్పులపై ప్రజలు సంతోషంగా ఉన్నారు. సీఎం ఇష్టాఇష్టాలేంటి? ప్రతీ దసరాకొచ్చి సీఎం ఏం చేస్తారు? గ్రామంపై సీఎం రేవంత్ చేసిన ప్రగతి సంతకమేంటి? సీఎం దోస్తులు ఏమంటున్నరు? ప్రజల కోరికలు ఏంటి? కేసీఆర్ చింతమడకతో కొండారెడ్డిపల్లిని పోల్చి ప్రజలు చెబుతున్న లాజిక్ లేంటి? సీఎం చిన్ననాటి జ్ఞాపకాలు ఏంటి? స్ఫూర్తిపొందిన ఘట్టాలేంటి? చిలిపి సంఘటనలేంటి? సరదా ముచ్చట్లేంటి? సీఎంకు సవాళ్ళు ఎదురైనపుడు అక్కడి ప్రజలు ఏమనుకుంటారు? సీఎం విజయాలు సాధించినపుడు అక్కడి ప్రజలు ఎలా పొంగిపోతారు? సీఎం కాకముందు.. సీఎం అయిన తర్వాత ఎనుముల రేవంత్ రెడ్డిపై కొండారెడ్డిపల్లి పబ్లిక్ రిపోర్ట్ ఏంటి? ఏఎన్ ఎన్ నర్సయ్య తాత మోసుకొచ్చిన ముచ్చట్లు ఎక్స్ క్లూజివ్ గా సోమవారం రాత్రి 8గంటలకు మీ ఎఎన్ఎన్ లో

ANN-MAHAA EXCLUSIVE

# సేవ్ తెలంగాణ, సపోర్ట్ బీజేపీ

## కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

బీజేపీ కార్యాలయంలో విజయోత్సవ సంబురాలు

ప్రజావిజయంతో మరింత బాధ్యత పెరిగింది

అడుగడుగునా ప్రభుత్వాన్ని నిలదీస్తాం

పనికిరాని మాటలకు కాదు... సమస్యలపై చర్చలకు సిద్ధం



**మహా :** 'సేవ్ తెలంగాణ, సపోర్ట్ బీజేపీ' అనే నినాదంతో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అడుగడుగునా కాంగ్రెస్ ను నిలదీస్తామని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ అభ్యర్థుల విజయం తెలంగాణ సమాజం, ఆత్మ బలిదానాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులలకే అంకితమన్నారు. ఈ విజయాన్ని తాము మరింత బాధ్యతగా భావిస్తూ భవిష్యత్ లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

**మిన్నంటిన విజయోత్సవ సంబురాలు**

ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం సాధించడంతో గురువారం నగర కార్యాలయంలో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. గెలిచిన అభ్యర్థులు మల్కా కొమురయ్య, అంజిరెడ్డితోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మిగతా 2లో




## జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం త్వరలో కొత్త పాలసీ: మంత్రి సీతక్క

### జర్నలిస్టులకు అండగా ఉంటాం

మహిళా జర్నలిస్టులు యజమానులుగా ఎదగాలి

మహిళల పట్ల గౌరవం పెరగాలి

పాఠ్యాంశాలు మహిళల గౌరవం పెంపొందేలా ఉండాలి

మహిళలను ఆ గౌరవిస్తే ఏ రకమైన శిక్షలు ఉండాయనేది అందరికీ తెలియాలి

మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క

03

# కేబినెట్‌లోకి విజయశాంతి?



(మొదటి పేజీ తరువాయి)

ఎఐసిసి ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్, విజయశాంతి ఇద్దరూ 20092014 మధ్య ఎంపీలుగా కలిసి పనిచేశారు. తెలంగాణ రాష్ట్రసాధన కోసం లోక్ సభలో విజయశాంతి పోరాడారు. సోనియాగాంధీతో విజయశాంతికి సత్సంబంధాలున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో విజయశాంతికి మంచి సంబంధాలున్నాయి. 2018 ఎన్నికల సమయంలో భట్టి విక్రమార్క ప్రచారకమిటీ ఛైర్మన్ గా, విజయశాంతి కోఛైర్మన్ గా పనిచేశారు. కూకట్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుండి కూడా విజయశాంతి పోటీచేస్తారని ప్రచారం జరిగింది. అయితే పోటీచేయడం కంటే ప్రచారం చేయడం వల్లే ఎక్కువ ఉపయోగం ఉంటుందని పార్టీ నేతలు భావించారు.

**మంత్రివర్గంలోకి నరేందర్ రెడ్డి, విజయశాంతి?**

విజయశాంతికి ఎమ్మెల్సీ ఇస్తే కేబినెట్ లోకి రావడం కూడా లాంఛనమేనన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డికి ఎమ్మెల్సీ దాదాపు ఖరారు కాగా, కేబినెట్ లోకి కూడా ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు పొలిటికల్ సర్కిల్స్ లో వినబడుతోంది. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో కేబినెట్ విస్తరణ కూడా ఖాయంగా కనబడుతోంది. ఉగాదికి ముందే పదవులన్నీ భర్తీ కానున్నాయి. ప్రస్తుత మంత్రివర్గంలోని పలువురి శాఖల్లో కూడా మార్పులు చేర్పులు జరగనున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో కూడా మంత్రి పదవులను భర్తీ చేసే అవకాశాలున్నాయి. ఓబిసి కోటాను విజయశాంతితో భర్తీచేసే అవకాశముందన్న ప్రచారముంది. సిపిఐకి కేటాయించే సీటు కూడా బిసికే ఇవ్వాలన్న షరతు పెట్టినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ 3, సిపిఐ ఒక స్థానంలో బరిలోకి దిగే అవకాశాలున్నాయి. ఎస్సీ కోటాలో అద్దంకి దయాకర్ కు దాదాపు ఖాయమన్న ప్రచారముంది. విజయశాంతి ఎంట్రీతో ఎమ్మెల్సీల కసరత్తు కొలిక్కివచ్చినట్లేనన్న చర్చ పార్టీలో ఉంది.

**సీనియర్ల ప్రయత్నాలు**

కాంగ్రెస్ పార్టీలో చివరినిమిషం దాకా ఏదైనా జరగొచ్చు. షబ్బీర్ అలీ, జీవన్ రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, మధుయాష్కీ, వీహెచ్, బెల్లయ్యనాయక్ తదితరులు పేర్లు ప్రచారంలో వినబడుతున్నాయి. ఇక రాహుల్ గాంధీని కలిసేందుకు ఢిల్లీ వెళ్ళిన జగ్గారెడ్డి తాను ఎమ్మెల్సీ అడగడం లేదని, మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశానని చెప్పారు.కుసుమకుమార్ కు ఎమ్మెల్సీ ఇవ్వాలని జగ్గారెడ్డి కోరుతున్నారు. సంస్థాగత కోటాలో కుమార్ రావు, హర్కర్ వేణుగోపాల్ పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి.

# రాన్యారావు ఒక్క ట్రిప్‌కు రూ. 13 లక్షల సంపాదన

## హీరోయిన్ తీగలాగితే..గోల్డ్ సిండికేట్ షేక్

(మొదటి పేజీ తరువాయి)

కర్ణాటకలో రాన్యారావు అరెస్టు వ్యవహారం కలకలం రేపుతోంది. కెంపేగౌడ ఎయిర్ పోర్టులో దాదాపు 14కేజీల బంగారం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన రాన్యారావు ఐపీఎస్ కుమార్తె కావటం గమనార్హం. కర్ణాటకలోని చిక్ మంగళూరు జిల్లాకు చెందిన వ్యక్తి రాన్యారావు. ఆమె తల్లి కాఫీ రైతు కుటుంబం నుంచి రాగా.. తండ్రి రామచంద్ర రావు కర్ణాటక పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీజీపీగా వ్యవహరిస్తున్నారు. అయితే, రాన్యా రావు స్మగ్లింగ్ హస్తం వెనుక తండ్రి హస్తం ఏమైనా ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తన తండ్రిని అడ్డుపెట్టుకొని ఇంతఈజీగా బంగారాన్ని తరలిస్తుందా అనే డౌట్స్ కూడా వస్తున్నాయి. పదిహేను రోజుల వ్యవధిలోనే ఏకంగా నాలుగుసార్లు విదేశీ ప్రయాణం చేయడంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్‌కి ఈమె కదలికలపై అనుమానం వచ్చింది. ఇలా తరచుగా నాలుగుసార్లు ఎందుకు దుబాయ్ వెళ్లిందనే అనుమానాలు కలగడంతో ఆమెపై నిఘా పెట్టారు. మార్చి 2వ తేదీ రాత్రి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు దుబాయ్ నుంచి ఎమిరేట్స్ ఫ్లైట్ ద్వారా వస్తుండటంతో విమానాశ్రయంలో దిగగానే అధికారులు రాన్యా రావును అదుపులోకి తీసుకున్నారు. ఆమెని తనిఖీ చేయగా.. తన దుస్తుల్లో బంగారు కడ్డీలను దాచిన విషయం బయటపడింది. తాను ధరించిన జాకెట్‌లోనే మూడుకేజీల బంగారం దాచినట్లు కూడా అనధికార సమాచారం. కాగా.. ఇలా పట్టుబడిన బంగారం విలువ 12కోట్ల 56 లక్షల రూపాయలుగా తేల్చారు.

**రాన్యారావు వెనుక సిండికేట్**

ఇంత ప్రొఫెషనల్‌గా బంగారం స్మగ్లింగ్ చేయడం వెనుక రాన్యారావు ఒక్కతే లేదని.. ఇంకా పెద్ద సిండికేటే ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు గతంలోనూ ఇలానే చేసిందని, దానికి తనకున్న సంబంధాలను వాడుకుని కస్టమ్స్ చెకింగ్ తప్పించుకుని ఉండొచ్చని కూడా చెప్తున్నారు. ఇక రాన్యారావుని పోలీసులు ఆర్థికనేరాల కోర్టు ఎదుట ప్రవేశపెట్టగా కోర్టు ఆమెకి 14రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించింది. మరోవైపు రాన్యారావ్ తండ్రికి ఉన్న హోదాని అడ్డం పెట్టుకుని కూడా ఈ స్మగ్లింగ్ జరుగుతుందా అనే కోణంలోనూ డిఆర్ఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. రాన్యారావ్ తండ్రి రామచంద్రరావ్‌ని బెంగళూరు డిఆర్ఐ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రశ్నించారు. అయితే, రాన్యా రావ్ కార్యకలాపాలతో తనకెలాంటి సంబంధం లేదని, తన కూతురు, అల్లుడు వ్యాపారం గురించి తనకేం తెలియదని రామచంద్రరావు చెప్పినట్లు స్థానిక మీడియా పేర్కొంది. అయితే, నాలుగు నెలల కిందటే ఆమెకు వివాహం జరిగింది. మరోవైపు రాన్యారావ్ ఇంట్లోనూ సోదాలు చేశారు. ప్రస్తుతానికి రాన్యారావుపై కస్టమ్స్ యాక్ట్ 1962 కింద కేసు నమోదు కాగా.. కన్నడ సినిమా ఇండస్ట్రీలో ఈమె అరెస్ట్ వ్యవహారం కలకలం రేపుతోంది. 2014లో సుదీప్ సరసన మాణిక్యలో హీరోయిన్‌గా చేయగా, పటాకీ, వాఘాలోనూ నటించింది. వర్ధమాననటిగా మాత్రమే తెలిసిన రాన్యారావ్.. ఇలా గోల్డ్ స్మగ్లింగ్ కేసులో అరెస్ట్ కావడం చర్చనీయాంశంగా మారింది. కాగా తనను బ్లాక్ మెయిల్ చేసి ఈ పని చేయిస్తున్నారని నటి రాన్యారావు విచారణలో చెప్పినట్లు తెలిసింది.







### 30 సార్లు దుబాయ్‌కు..

**గత ఏడాది కాలంలో రన్యా రావు 30 సార్లు దుబాయ్‌కు రాకపోకలు సాగించిందట. ఇలా ట్రిప్‌కు వెళ్లిన ప్రతిసారి కిలోల కొద్దీ బంగారాన్ని తన వెంట తీసుకొచ్చేదట. అక్రమంగా తరలించినందుకు ప్రతి కిలో బంగారం మీద ఆమె రూ.1 లక్ష అందుకునేదని సమాచారం. అలా ప్రతి దుబాయ్ ట్రిప్ ద్వారా దాదాపుగా రూ.12 నుంచి రూ.13 లక్షల వరకు అందుకునేదట. స్మగ్లింగ్ ఆపరేషన్స్ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన జాకెట్స్, వెస్ట్ బెల్ట్‌స్‌ను రన్యా రావు ఉపయోగించేదని వినిపిస్తోంది. ఇవే జాకెట్స్, బెల్ట్‌స్‌ను ఆమె రాకపోకలకు వినియోగించేదని తెలుస్తోంది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ పోలీసులు అరెస్ట్ చేసిన సమయంలో ఆమె ధరించిన ఆ జాకెట్‌లో భారీగా బంగారు బిస్కెట్లు, కడ్డీలు ఉన్నాయని సమాచారం. కాగా బంగారం రవాణా రాకెట్ విక్రయాల వెనుక తమిళనాడు, తెలంగాణ. ఎపికి కూడా లింకులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.**

# 12 నుండి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు



(మొదటి పేజీ తరువాయి)

ఇదే కాకుండా కొత్తగా ఏర్పడిన డివిజన్లు, మండలాలకు సైతం కొత్తగా పోస్టులను మంజూరు చేసింది. వీటితో పాటు సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులకు సైతం ఆమోద ముద్ర వేసింది. రాష్ట్రంలోని 10,950 గ్రామాలకు క్షేత్ర స్థాయి అధికారుల నియమానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, కొత్త డివిజన్లు, మండలాలకు 217 పోస్టుల మంజూరు, 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు సైతం క్యాబినేట్ ఆమోదం తెలుపడం పట్ల ఉద్యోగసంఘాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి.

**ఉగాది నుండి భూభారతి చట్టం**

ఉగాది నుండి భూభారతి చట్టం అమలుచేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఫ్యూచర్ సిటీ కోసం కొత్త బోర్డు ఏర్పాటు చేయాలని, నదీ జలాల అంశంపై ప్రత్యేక కమిటీ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. సీఎం రేవంత్ అధ్యక్షతన 6 గంటల పాటు ఈ కేబినెట్ భేటీ కొనసాగింది. సుదీర్ఘంగా చర్చించి మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**ముసాయిదా బిల్లుకు ఆమోదం**

సమావేశంలో ఎస్సీ కులాల వర్గీకరణ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. న్యాయ పరమైన చిక్కులు లేకుండా ముసాయిదా బిల్లుకు తుదిమెరుగులు దిద్దాలని సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకోసం న్యాయనిపుణుల సలహాలు తీసుకొని తుది మెరుగులు దిద్దాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.

### సీఎం, మంత్రులకు ఉద్యోగ సంఘాల థ్యాంక్స్

**రాష్ట్రంలోని 10,950 గ్రామాలకు క్షేత్ర స్థాయి అధికారుల నియమానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్(డీసీఏ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 10,950 గ్రామాలకు క్షేత్ర స్థాయి అధికారుల నియమానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, కొత్త డివిజన్లు, మండలాలకు 217 పోస్టుల మంజూరు, 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు సైతం క్యాబినేట్ ఆమోదం తెలుపడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, ఇతర మంత్రులకు, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.**



# తెలంగాణలో ఒంటిపూట బడులు

## ఈనెల 15వ తేదీ నుంచి అమలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతీయేటా ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. ప్రస్తుతం ఎండల తీవ్రత నేపథ్యంలో ఈనెల 15వ తేదీ నుంచి అన్ని బడుల్లో ఒంటిపూట తరగతులు నిర్వహించాలని తెలంగాణ విద్యాశాఖ నిర్ణయించింది. దీంతో ప్రభుత్వ స్కూళ్లతోపాటు ప్రైవేటు, ఎయిడెడ్ ఇతర అన్ని మేనేజ్మెంట్ల పరిధిలోని బడులు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకే నిర్వహించనున్నారు. లాస్ట్ వర్కింగ్ డే ఏప్రిల్ 23 వరకూ హాఫ్ డే స్కూల్స్ కొనసాగనున్నాయి.

# సేవ్ తెలంగాణ, సపోర్ట్ బీజేపీ

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులకు, ముమ్మర ప్రచారం నిర్వహించి మోదీ నేతృత్వంలో విజయం సాధించేలా తీవ్ర ప్రయత్నాలు చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి శాలువాలతో పార్టీ వర్గాలు సన్మానించాయి. అనంతరం జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ఫలితాలు తెలంగాణ ఉపాధ్యాయులకు, సమాజానికి అంకితమిస్తున్నామన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంతో అంకిత భావంతో గ్రామస్థాయిలో పనిచేసి గొప్ప ఫలితాలను రాబట్టారన్నారు. బీజేపీకి సంబధించినంత వరకు రెండు స్థానాల్లో ఏకకాలంలో విజయం సాధించడం అభినందనీయమన్నారు. 37 శాతం మంది బీజేపీకి మద్ధతు ఇచ్చారన్నారు. తెలంగాణలో ప్రత్యామ్నాయం బీజేపీ అనే భావిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే బీజేపీని ఆదరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ సమాజం బీజేపీ బలపడాలని కోరుకుంటుందన్నారు. మూడు స్థానాల్లోని రెండు కీలక స్థానాలను కైవసం చేసుకున్నామన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే సత్తా మోదీ ఆధ్వర్యంలో బీజేపీకే ఉందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలపై నీళ్లు జల్లారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మోసం చేయడం, తప్పుడు ఆరోపణలు, వితండవాదం, తప్పించుకునే ప్రయత్నాలను తెలంగాణ సమాజం గమనిస్తుందన్నారు. అయినా ప్రజలు సీఎం మాటలు, ఆరోపణలను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలనైనా హామీలను నెరవేర్చక ఎదురు దాడులకు దిగుతున్నారని, బీజేపీపై ఆరోపణలను నెడుతున్నారని మండిపడ్డారు. కానీ ప్రజా తీర్పు చాలా స్పష్టంగా కనిపిస్తుందన్నారు.

**కర్రుకాల్చి వాత పెట్టారు**

పదేళ్లు తనదే అధికారమని మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారన్నారు. బీజేపీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమబాట పడతామన్నారు. ఇప్పుడిప్పుడే సంస్థాగతంగా మరింత పటిష్టం అవుతున్నామని చెప్పారు. గత నాలుగు నెలలుగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఒకటి రెండు నెలల్లోనూ అన్ని కమిటీలను పూర్తి చేసుకొని రాష్ట్రంలో బలమైన శక్తిగా ప్రజా సమస్యలపై ముందుకు వెళ్లి పోరాడతామన్నారు. ఉపాధ్యాయుల్లో సమస్యలపై తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. బీజేపీ తరఫున శాసనమండలిలో అన్ని సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ప్రశ్నిస్తామని అన్నారు. తమ ముగ్గురు సభ్యులు కూడా ప్రభుత్వాన్ని నిలదీసే ప్రయత్నం చేస్తామని అన్నారు. బీజేపీ కార్యకర్తలను అనేక రకాలుగా వేధించారని ఆరోపించారు. బీజేపీని ఓడించాలని కుట్రలు పన్నినా ప్రజలు తమనే నమ్మి గెలిపించారన్నారు. ఎంపీలు 8, ఎమ్మెల్యేలు, 8, ఎమ్మెల్సీలు 3 రానున్న రోజుల్లో పోరాటాలకు సమాయత్తం అవుతామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ రాష్ట్రంలో మోదీ నేతృత్వంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. సేవ్ తెలంగాణ, సపోర్ట్ బీజేపీ అనే నినాదంతో ముందుకు వెళతామని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మరోమారు బీజేపీ అభ్యర్థులను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

**రెఫరెండమా? వైఫల్యమా? ఆత్మ పరిశీలన చేసుకోవాలి**

కాంగ్రెస్ రెఫరెండమా, వైఫల్యమా? ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఇప్పటికైనా అన్ని హామీలను అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికలు తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పట్టభద్రుల ఆశీర్వాదాలతో గెలిచామని స్పష్టం చేశారు. అవకాశవాదం కోసం కలిసే అలవాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ లకే ఉందని చరిత్ర చెబుతుందని, ఇది నగ్నసత్యమని వారికి జవాబు చెప్పాల్సిన ఖర్మ ఏం పట్టలేదని అన్నారు. వారి అసమర్థతను ఇతర పార్టీలపై రుద్దడం వారికి అలవాటుగా మారిందన్నారు. ఇది సాక్షాత్తూ తెలంగాణ ప్రజల్లో ఈ రెండు పార్టీలపై వస్తున్న వ్యతిరేకత అని గుర్తించాలన్నారు. ఇప్పటికైనా సమస్యలపై చర్చించేందుకు సిద్ధమేనన్నారు. పనికిరాని ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. తమను ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు. వారు తమ వెంట ఉంటే చాలన్నారు. మూడు రాష్ట్రాలలో ఓడించి ప్రజలు కాంగ్రెస్ కు రిటర్న్ గిఫ్ట్ ఇస్తారని చెప్పారు. మోదీ ఆధ్వర్యంలో ఇది తప్పదని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# అప్ కీ బార్ చార్ సౌ పార్ అన్నారు ఏమైంది

- **ఎమ్మెల్సీ గెలుపుతో విర్రవీగుతున్న బండి సంజయ్**
- **మోడీ హామీలను అమలు చేయించు**
- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**మహా :** ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఒక్క ఎన్నికలో గెలిచి విర్రవీగడం కాదని, మోడీ నినాదం అప్ కీ బార్ చార్ సౌ పార్ అని ఒడినపుడు ఎందుకు మాట్లాడలేదన్నారు. ఏటా 10 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి మాట తప్పారని, దాని గురించి ప్రజల ముందు మాట్లాడాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నిక గెలుపుతో బీజేపీ ఏదో చేస్తుందనుకోవడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆఈదరించి అక్కున చేర్చుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు.

**ప్రభుత్వానికి సంబంధించిన ఒక్క పైసా వృధా కానివ్వం**

బేగంపేటలోని ప్రజా భవన్ లో నిర్మించిన ప్రభుత్వ గెస్ట్ హౌజ్ ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి గత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం క్యాంపు ఆఫీసుగా వినియోగించిన భవనాన్ని ఆధునీకరించి స్టేట్ గెస్ట్ హౌస్ గా మార్చడం జరిగిందన్నారు. స్టేట్ గెస్ట్ హౌస్ లో అన్ని వసతులతో ఇంటిని మరిపించాలా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని అధికారులు, వేరే రాష్ట్రాల నుంచి వచ్చే అతిధులకు, విదేశాల నుంచి వచ్చే అతిథులకు ఆతిథ్యం ఇవ్వడం కోసం ఈ స్టేట్ గెస్ట్ హౌస్ ని వినియోగంలోకి తేవడం జరిగిందని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా స్టేట్ గెస్ట్ హౌస్ ను సకల సౌకర్యాలతో ఫైవ్ స్టార్ హోటల్ లో మరిపించేలా తీర్చిదిద్దామన్నారు. వేరే రాష్ట్రాల నుంచి వచ్చే అతిధుల కోసం హోటళ్లలో గదులు కేటాయించి ప్రజాధనం వృధా చేయకుండా స్టేట్ గెస్ట్ హౌస్ ను వినియోగిస్తామన్నారు. ఇవ్వాలమేం ఎలాంటి ఖర్చులు లేకుండా సకల సౌకర్యాలతో కూడిన స్టేట్ గెస్ట్ ను వినియోగంలోకి తెచ్చామని, మాకు ఆడంబారాల కన్నా అవసరాలు తీరడం ముఖ్యం, ప్రజాధనాన్ని ఒక్క రూపాయి వృధాగా పోనివ్వమన్నారు.



# 2047 నాటికి నెం.1 ఆర్థిక వ్యవస్థగా భారత్

## ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే సాధ్యం

### అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో భారతీయులు
### ప్రపంచవ్యాప్తంగా నాకు అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు
### రిపబ్లిక్ ప్లీనరీ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు నాయుడు




**మహా :** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటికి భారతదేశం నెం.1 ఆర్థిక వ్యవస్థగా మారుతుందని, ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో భారతీయులు ముందుంటారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. భారతీయులను యూదు సమాజంతో పోలుస్తూ, ప్రపంచంలో అత్యంత సంపన్నులుగా, ప్రభావవంతమైన వ్యక్తులుగా భారతీయులు ఉన్నారని అన్నారు. గురువారం ఢిల్లీలో రిపబ్లిక్ ప్లీనరీ సమ్మిట్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి పలు అంశాలపై మాట్లాడారు.

**భారతీయుల ప్రతిభ ప్రతిబింబిస్తోంది**

ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాంతాల్లో భారతీయులు సంపన్నులుగా ఉన్నారని, ఇది వారి ప్రతిభను ప్రతిబింబిస్తుందని సీఎం అన్నారు. అమెరికాలో భారతీయుల సగటు ఆదాయం మిగిలిన వర్గాల కంటే రెట్టింపని చెప్పారు. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన భారతీయుల్లో 33 శాతం మంది తెలుగు కమ్యూనిటీకి చెందినవారు ఉన్నారని అన్నారు. భారతదేశ వృద్ధికి ముఖ్యంగా మూడు రంగాలపై దృష్టి పెట్టినట్టు ముఖ్యమంత్రి వివరించారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ద్వారా ఐటీ నుంచి ఏఐ కి మారడం... గ్రీన్ హైడ్రోజన్‌లో అభివృద్ధి సాధించడం... మానవ వనరులని బలోపేతం చేయడంపై తమ లక్ష్యమన్నారు. ఈ రంగాలపై దృష్టి సారించడం వల్ల భారతీయులు ప్రపంచంలోనే అత్యుత్తమ శ్రామిక శక్తిగా, ఆవిష్కర్తలుగా మారతారని అన్నారు.

**భారతదేశానికి జనాభానే బలం**

భారతదేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్ల లోపు ఉన్నందున, భారతదేశానికి జనాభా ప్రయోజనం ఉంది. చైనా, జపాన్ జనాభా తగ్గడం భారతదేశానికి కలిసొచ్చే అంశమని దానిని దేశ అభివృద్ధికి తెలివిగా వినియోగించుకోవాలని చెప్పారు. ఇద్దరు పిల్లల కంటే తక్కువ ఉన్న అభ్యర్థులు స్థానిక ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులని చేసే విధానంపై కేంద్రం ఆలోచన చేయాలని సూచించారు.

**అమరావతి పునర్నిర్మాణం**

గత కొన్నేళ్లుగా ఒడిదుడుకులను ఎదుర్కొన్న ఏపీ రాజధాని అమరావతిని పునరుజ్జీవింపజేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రపంచంలోనే ప్రత్యేకమైన సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడల్‌ను ఉపయోగించి 29,000 మంది రైతుల దగ్గర నుంచి 35,000 ఎకరాల భూమిని రాజధాని కోసం సేకరించారని గుర్తు చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నగరాల్లో ఒకటిగా అమరావతిని తీర్చిదిద్దుతామని, దానిని మళ్లీ గాడిలోకి తీసుకువస్తామని చెప్పారు.

**చారిత్రాత్మక విజయం**

2024 ఎన్నికల్లో టీడీపీకి 93 శాతం స్ట్రైక్ రేట్, 57శాతం ఓట్ షేరును సాధించిందని ముఖ్యమంత్రి అన్నారు. తన నాయకత్వానికి ప్రజలు బలమైన మద్దతును ఇచ్చారని అన్నారు. తాను ఎలాంటి నేరం చేయకుండా అరెస్టు చేస్తే, ప్రజలంతా ఆ సమయంలో తనకు అండగా నిలిచారని చెప్పారు. గవర్నెన్స్ అంటే కేవలం హార్డ్ వర్క్ మాత్రమే కాకుండా తెలివిగా ఉండాలని, 1,000 సేవలను మీ సేవ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నామని అన్నారు.

**భారతదేశం ముందున్న మార్గం**

భారతదేశ అభివృద్ధిని ఆపలేమని చంద్రబాబు అన్నారు. రానున్న 10-15 ఏళ్లలో భారతీయ నిపుణులు సేవా రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్యం చెలాయిస్తారని అంచనా వేశారు. నేటి ప్రపంచంలో దూరం అనేది ఒక పరిమితి కాదని అన్నారు.

## రూ.1500 కోట్ల పెట్టుబడితో

# అతిపెద్ద తయారీకేంద్రం

## 1600 మందికి ఉద్యోగ అవకాశాలు

### లెన్స్ కార్ట్ శంఖుస్థాపన కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో లెన్స్‌కార్ట్ సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద కళ్లజోడు తయారీ కేంద్రాన్ని రూ.1500కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ సమీపంలో రావిర్యాల నాన్‌సెజ్ జనరల్ పార్క్‌లో ప్రారంభమయ్యే ఈ ఫ్లాంట్‌కు 50 ఎకరాలు కేటాయించామన్నారు. ఇక్కడ కళ్ల జోడు ఫ్లాంట్ ఏర్పాటు ద్వారా సుమారు 1600 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గురువారం తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి లతో కలిసి ఈ ఫ్లాంట్‌కు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. లెన్స్ కార్ట్ ప్రపంచంలోనే అతి పెద్ద కళ్లజోడుల తయారీ కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయం అని దీంతో తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తం అవుతుందన్నారు. రెండేళ్లలోనే ఈ ఫ్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని, నాలుగేళ్లలోనే పూర్తిగా కార్యకలాపాలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ ఫ్లాంట్ ఏర్పాటుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం, లెన్స్‌కార్ట్ మధ్య గతేడాది 2024 డిసెంబర్ 8న ఎంవోయూ కుదిరిందన్నారు. ఇప్పటికే లెన్స్‌కార్ట్‌కు రాజస్థాన్‌లో అధునాతన కళ్లజోడు తయారీ యూనిట్ ఉన్నప్పటికీ.. మన దగ్గర ఏర్పాటు కాబోయే ఫ్లాంట్ ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్లాంట్ అని చెప్పేందుకు సంతోషిస్తున్నామన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు కానున్న ఈ ఫ్లాంట్ తెలంగాణకు తలమానికం అవుతుందన్నారు. కళ్ల జోడు తయారీ రంగంలో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్లడం ఖాయమన్నారు. ఇక్కడ తయారయ్యే కళ్ల జోడు ఉత్పత్తులు జపాన్, సింగపూర్, థాయ్‌లాండ్, తైవాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, మలేషియా, వియత్నాం, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలకు ఎగుమతి అవుతాయని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు.



### విజయమ్మ, షర్మిల షేర్ల బదిలీపై హైదరాబాద్ ట్రైబ్యునల్‌లో

# జగన్ పిటిషన్

**మహా :** వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం షఏర్ల బదలాయింపుపై హైదరాబాద్ లోని జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ లో పిటిషన్ దాఖలు చేశారు. తమ ర్లను విజయమ్మ, షర్మిల అక్రమంగా బదిలీ చేసుకున్నారని పిటిషన్ లో జగన్ పేర్కొన్నారు. కనీసం తన సంతకాలు లేకుండా షేర్ల బదిలీ జరిగిందని పేర్కొన్నారు. ప్రతివాదులుగా విజయమ్మ, షర్మిల, సండూర్ పవర్, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ లను పేర్కొన్నారు. తన పేరు మీద, వైఎస్ భారతి పేరు మీద ఉన్న షేర్లను తల్లి విజయమ్మ, చెల్లెలు షర్మిల అక్రమంగా బదిలీ చేసుకున్నారని పేర్కొన్నారు. బదిలీ చేసుకున్న షేర్లపై స్టే విధించాలని గత వారం జగన్ కోరారు. తాజా పిటిషన్‌తో పాటు మధ్యంతర పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయడానికి వాద, ప్రతివాదులు గడువు కోరడంతో తదుపరి విచారణను వచ్చే నెల 3వ తేదీకి వాయిదా పడింది.

# రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు షాక్

## లగచర్ల, హకీంపేట భూ సేకరణ నోటిఫికేషన్ రద్దు

**మహా :** తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. లగచర్ల, హకీంపేట భూసేకరణ రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. ఈ భూసేకరణపైన పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమైంది. భూసేకరణ కోసం లగచర్ల సమీపంలో కలెక్టర్ తో పాటుగా అధికారుల పైన దాడి జరిగింది. రాజకీయంగానూ పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. ఫార్మా సిటీ కోసం భూ సేకరణ రద్దు చేసిన ప్రభుత్వం మల్టీ పర్పస్ పారిశ్రామిక పార్క్ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. తాజా కోర్టు ఆదేశాలలో ప్రభుత్వం తదుపరి అడుగులు ఏంటనేది స్పష్టత రావాల్సి ఉంది. సీఎం రేవంత్ సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని లగచర్ల, హకీంపేటలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందుకు సంబంధించి భూసేకరణ కోసం గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. గతేడాది నవంబర్ 11న ఫార్మా కంపెనీల ఏర్పాటు సంబంధించి భూసేకరణ కోసం లగచర్ల సమీపంలో కలెక్టర్, ఇతర అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలోకి వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై ఒక్కసారిగా కొందరు దాడులకు దిగారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద దుమారానికి కారణమైంది. ఈ ఘటనకు సంబంధించి కుట్ర చేశారన్న అభియోగాలతో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ నేతలు, రైతులు కూడా అరెస్ట్ అయ్యారు. ఫార్మాసిటీని రైతులు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఆ భూసేకరణ నోటిఫికేషన్ను ప్రభుత్వం రద్దు చేసింది. నవంబర్ 30న అదే ప్రాంతంలో మల్టీ పర్పస్ పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన భూసేకరణను ప్రారంభించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు హైకోర్టును ఆశ్రయించారు. వీటిపైన విచారణ నిర్వహించిన హైకోర్టు భూ సేకరణ నోటిఫికేషన్ రద్దు చేస్తూ నిర్ణయం వెలువరించింది. ఇక, ఇప్పుడు ప్రభుత్వం ఈ తాజా ఆదేశాల పైన తదుపరి చర్యలు ఏంటనేది ఆసక్తి కరంగా మారుతోంది.

## రంగంలోకి దిగిన ఏఐసీసీ కార్యదర్శులు

- గాంధీభవన్ లో 48 మంది సీనియర్లతో భేటీ
- వన్ టు వన్ ప్రశ్నించిన ఏఐసీసీ నేతలు
- నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. ఓ వైపు నామినేటెడ్ పదవులు, మరోవైపు పార్టీ రాష్ట్ర కార్యవర్గ పదవుల భర్తీకి నేరుగా ఏఐసిసి కార్యదర్శులు రంగంలోకి దిగారు. ఈ నెల 10వ తేదీ లోపు ఆశావహులు తమ పేర్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల గాంధీభవన్ లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో తెలిపారు. ఈ నేపథ్యంలో పదేండ్లుగా పార్టీలో కొనసాగుతున్న సీనియర్ నాయకులతో ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాథ్ ఇవాళ భేటీ అవుతున్నారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాలనుంచి 48 మంది సీనియర్ నేతలను గురువారం గాంధీభవన్ పిలిచారు. విష్ణునాథ్ 24 మందితో , విశ్వనాథన్ 24 మందితో వన్ టు వన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి నుంచి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై ఆరా తీస్తూనే పార్టీ గత, ప్రస్తుత పరిస్థితి గురించి తెలుసుకుంటున్నారు. 'పార్టీలో ఎంత కాలం నుంచి కొనసాగుతున్నారు? .. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మీరు ఏ నియోజకవర్గానికి ఇంచార్జ్ గా ఉన్నారు? అక్కడ పార్టీ గెలిచిందా? ఓడిందా? .. పార్టీలో ఇప్పుడు మీరు ఏ పదవి ఆశిస్తున్నారు?' అనే ప్రశ్నలను సంధిస్తున్నారు. ఎమ్మెల్యేలకు వారి నియోజకవర్గాల్లో అసెంబ్లీకన్నా పార్లమెంట్ లో ఓట్లు పెరిగాయా.. తగ్గాయా? ఆరా తీశారు. కోరుకుంటున్న పదవుల గురించి తెలుసుకున్నారు. వన్ టు వన్ మీటింగ్ లో వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, పలు వురు పీసీసీ ఆఫీసు బేరర్లతో ఏఐసీసీ కార్యదర్శులు మాట్లాడినట్టు సమాచారం. పలువురు ఎమ్మెల్యేలు తమకు విస్తరణలో మంత్రి పదవులు కావాలని కోరగా, పలువురు నేతలు నామినేటెడ్ పదవులు కోరారు.

# ప్రమాదం జరుగుతుందని ప్రభుత్వానికి ముందే తెలుసు

## టన్నెల్ ప్రమాదంపై మాజీ మంత్రి కేటీఆర్

### హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో దర్యాప్తు జరపాలని డిమాండ్



**మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు కొంతమంది మంత్రులు కమీషన్ల కోసం కక్కుర్తి పడడంతోనే ఎస్ఎల్ బీ సీ టన్నెల్ ప్రమాదం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని రెడ్ జోన్ గా ప్రకటించిన రెండు నివేదికలు ప్రభుత్వం దగ్గర ఉన్నప్పటికీ తమ సొంతలాభం కోసం టన్నెల్ పనులు కొనసాగించి ఎనిమిది మందిని బలిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల కోట్ల ప్రజాధనం వృథా చేయడంతో పాటు ఎనిమిది కుటుంబాల్లో ఎడతెగని శోకానికి కారణమైన ప్రమాదానికి రాష్ట్ర కేబినేట్ బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. టన్నెల్ పనులు చేస్తున్న జైప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ 2020లో అంబర్గ్ టెక్ ఏజి అనే సంస్థ తో టన్నెల్ ప్రాంతంలో ఓ సర్వే నిర్వహించారని కేటీఆర్ చెప్పారు. టన్నెల్ సిస్మిక్ ప్రెడిక్షన్ (టీఎస్పి) సర్వే చేసి మొన్నటి ప్రమాదాన్ని 2022లోనే అంబర్గ్ టెక్ ఏజి ఊహించి హెచ్చరించిందన్నారు. టన్నెల్ లోని 13.88 కిమీ నుండి 13.91 కిమీ మధ్య ఫాల్ట్ జోన్ ఉందని స్పష్టంగా చెప్పారన్న కేటీఆర్, ఆ ప్రాంతంలోని రాళ్లు ధృడంగా లేకపోవడంతో పాటు నీటి లీకేజీలు భారీగా ఉన్న సంగతిని హైలెట్ చేశారని కేటీఆర్ తెలిపారు. ఆ రిపోర్ట్ లో ఉన్నట్టుగానే మొన్నటి ప్రమాదం ఫాల్ట్ జోన్ లోనే జరిగిందన్నారు. 2022లోనే జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ జనరల్ మండపల్లి రాజు తో పాటు జైప్రకాష్ అసోసియేట్స్ భూగర్భ శాస్త్రవేత్త రితురాజ్ దేశ్ముఖ్ లు చేసిన మరో సర్వే రిపోర్ట్ కూడా ప్రభుత్వం దగ్గర ఉందన్నారు కేటీఆర్. ఆ నివేదిక ప్రకారం టన్నెల్ ఉపరితలాన్ని సరిగా అంచనా వేయకుండానే నిర్మాణాన్ని మొదలు పెట్టారని చెప్పారు. ఎస్.ఎల్.బి.సి టన్నెల్లో ప్రమాదం జరుగుతుందని ముందే చెప్పిన ఈ నివేదికలను రేవంత్ ప్రభుత్వం దాచి పెట్టి కార్మికులతో పనులు చేయించిందని కేటీఆర్ ఆరోపించారు. ఈ రెండు నివేదికలపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వడంతో పాటు హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం త్వరలో కొత్త పాలసీ

## మంత్రి సీతక్క

- జర్నలిస్టులకు అండగా ఉంటాం.. మహిళా జర్నలిస్టులు యజమానులుగా ఎదగాలి
- మహిళల పట్ల గౌరవం పెరగాలి.. పాఠ్యాంశాలు మహిళల గౌరవం పెంపొందేలా ఉండాలి
- మహిళలను అ గౌరపరిస్తే ఏ రకమైన శిక్షలు ఉంటాయనేది అందరికీ తెలియాలి
- మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క




**మహా :** జర్నలిస్టుల సంక్షేమం కోసం కొత్త పాలసీని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమం, వైద్యం, అభివృద్ధి, వేతనాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి ఒక కొత్త పాలసీ తీసుకురావడానికి కృషి చేస్తానని చెప్పారు. "ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్" ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ లోని సొసైటీ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. సొసైటీలోని సీనియర్ మహిళా జర్నలిస్టులను ఆమె సన్మానించారు. సొసైటీ చరిత్రను, జర్నలిస్టుల కోసం సొసైటీ చేస్తున్నకృషిని అధ్యక్షు బ్రహ్మాండభేరి గోపరాజు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే ఒక ఉద్యమ ఉత్సాహమని, ఈ రోజుల్లో రకరకాల థీమ్స్ తో మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారని అన్నారు. జర్నలిజంలో పని చేస్తున్న మహిళా జర్నలిస్టులు యజమానులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వార్తల సేకరణలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. కుంభకోణాలను బయటికి తీయడానికి కూడా వెనుకాడని ధైర్యవంతులు ఉన్న మీడియా రంగంలో పని చేస్తున్న మహిళలకు సైతం లైంగిక వేధింపులు, వేతనాల్లో అసమానతలు, వివక్షత తప్పడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రపంచానికి తెలియజేయడంలో మీడియా పాత్ర కీలకం అని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు ఎంతో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. వివిధ రంగాల్లో సక్సెస్ సాధించిన మహిళల కథనాలను విస్తతంగా ప్రచురించి ప్రచారం చేస్తే ఇంకా మంచిది అనీ, మీ కలం ద్వారా మహిళలను మరింత ప్రోత్సహించాలని కోరారు. సమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే కథనాలు రావాలని మంత్రి ఆకాంక్షించారు. ఇప్పటి వరకు జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ఆడవారి పట్ల గౌరవం అనేది ఇంటినుంచి ప్రారంభం కావాలనీ, ఇంట్లో పిల్లలకు నేర్పాలి, పాఠశాల్లలో గురువులు నేర్పాలి, పాఠ్యాంశాల్లో చేర్పించాలి అనేది తన అభిమతమన్నారు. అలాగే మహిళ అగౌరవపరిస్తే ఏ రకమైన శిక్షలు ఉంటాయనేది కూడా అందరికీ తెలియాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళా జర్నలిస్టులను సీతక్క సన్మానించారు. అనంతరం సొసైటీ సభ్యులు, మహిళా జర్నలిస్టులు కలసి సీతక్క ను ఘనంగా సత్కరించారు. గతంలో మూడు కాలనీలకు కలిపి 36 మంది మహిళా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను సొసైటీ కేటాయించిందనీ, ఇంకా వందకు పైగా మహిళా జర్నలిస్టులు వెయింటింగ్ లిస్ట్ ఉన్నారని సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మాండభేరి గోపరాజు మంత్రి సీతక్క కు గుర్తు చేశారు. వారికి కూడా పట్టాలు ఇప్పించే బాధ్యత సీతక్క తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ దేవులపల్లి అమర్, ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మాండభేరి గోపరాజు, కార్యదర్శి రవీంద్ర బాబు, ఉపాధ్యక్షుడు లక్ష్మి నారాయణ మసాదె, సంయుక్త కార్యదర్శి డా. చల్లా భాగ్యలక్ష్మి, కోశాధికారి భీమగాని మహేశ్వర్ గౌడ్, ఎంసి మెంబర్ కమలాకరాచార్య తోపాటు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ తెలంగాణ

## ఎమ్మెల్సీల గెలుపుతో కీలక మలుపు

### దక్షిణాదికి కాషాయ అడ్డాగా మారనున్న రాష్ట్రం

**మహా :** తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజా ఎమ్మెల్సీ ఎన్నిక ల్లో బీజేపీ రెండు స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ సిట్టింగ్ సీటు కోల్పోయింది. బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉంది. అనూహ్య ఫలితాలతో ఒక్క సారిగా బీజేపీలో జోష్ పెరిగింది. గెలిచిన ఎమ్మెల్సీలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభినందించారు. ఢిల్లీ కేంద్రంగా ఆపరేషన్ తెలంగాణ మొదలైంది. ఈ ఎన్నికల తో రాజకీయంగా డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. మారుతున్న లెక్కలు తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారుతున్నాయి. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా ఫలితాలు ఉంటాయి. ఇక్కడ మాత్రం ఫలితాలు భిన్నంగా వచ్చాయి. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంది. బీజేపీ అనూహ్యంగా రెండు స్థానాలు గెలుచుకుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సిట్టింగ్ సీటును బీజేపీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా భావించిన కరీంనగర్‌నిజామాబాద్‌ఆదిలాబాద్‌మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ విజయం సాధించింది. బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి రెండో ప్రాధాన్యఓట్లతో విజయం సాధించారు. కాంగ్రెస్ కు షాక్ ఇదే జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్నీ గెలుచుకున్న బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీని కూడా దక్కించుకోవడం ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మరోసారి పట్టు నిరూపించు కుంది. కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో సిటింగ్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత జీవన్‌రెడ్డి ఉన్నారు. ఈసారి పోటీకి ఆయన సుముఖత తెలపకపోవడంతో కాంగ్రెస్ అధిష్ఠానం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డిని బరిలోకి దింపింది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నా, మిత్రపక్షంగా సీపీఐ మద్దతు ప్రకటించినా కాంగ్రెస్ తన సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోలేకపోయింది. గత కొన్నాళ్ళుగా బీజేపీ తెలంగాణపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ క్రమక్రమంగా ప్రజలకు దూరమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలవడం, పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తిగా వైఫల్యం చెందడం, ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండటం బీజేపీకి క్రమక్రమంగా కలిసి వస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అంత సులభంగా గెలవవచ్చని భావించి అంతగా పట్టించుకోలేదు. ఇదే సమయంలో ఈ ఎన్నికలను జాతీయ నాయకత్వం సీరియస్ గా తీసుకుంది. ఎప్పటికప్పుడు ప్రచార సరళిని బేరీజు వేసిన జాతీయ నాయకత్వం క్షేత్రస్థాయి నేతలకు శలహాలు సూచనలు ఇవ్వడంతో పాటు ఇద్దరు కేంద్ర మంత్రులను రంగంలోకి దించి చావో రేవో తేల్చాలని ఆదేశింటచింది. దీంతో కాలికి బలపం కట్టుకుని ఇద్దరు కేంద్ర మంత్రులతో పాటు రాష్ట్ర స్థాయి నేతలందరూ ఎమ్మెల్సీ ఎన్నికలను తీవ్రంగా పరిగణించి అధికార కాంగ్రెస్ కు భారీ షాకివ్వాలని నిర్ణయించుకున్నారు. అయితే ఈ విషయాన్ని చివరి క్షణంలో పసిగట్టిన అధికార కాంగ్రెస్ పార్ఫ్ శక్తి.యుక్తులను ఒడ్డి ప్రచారం చేసింది. ఎన్నికల్లో విజయంతో రాబోయే రోజుల్ లోకాషాయ పార్టీ తెలంగాణను దక్షిణాదికి అడ్డాగా మార్చుకోవాలన్న సంకల్పంతో ఉన్నట్లు ప్రచారం జోరందుకుంది.

EDITORIAL
సంపాదకీయం

# కేరళలో కొత్త ప్రమాదం




కేరళలో కొత్త ప్రమాదం ఆందోళన కలిగిస్తోంది. దక్షిణ భారత దేశంలోని కేరళ మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో 11శాతం ,దాదాపు 4,22,299 హెక్టార్ల భూమి ప్రస్తుతం ఎడారీకరణ దశలో క్షీణించిపోతుంది. ఈ క్షీణత జీవవైవిధ్య నష్టం, ఆహార అభద్రత, నీటి కొరత, మానవవన్యప్రాణుల సంఘర్షణలకు దారితీస్తుందని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఈ అంశమే ఇప్పుడు దేశంలో పర్యావరణ పరిరక్షణ విషయంపై సరికొత్త ఆందోళనలను లేవనెత్తుతోంది. ఒక్క కేరళ మాత్రమే కాదు.. దేశ మొత్తం భౌగోళిక ప్రాంతంలో దాదాపు 30శాతం భూమి ఎడారీకరణకు లేదంటే క్షీణతకు గురవుతోంది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఇటీవల రాజ్యసభలోఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. భారత్ కు చెందిన రాష్ట్రాలు, యూటీలలో, ఎడారీకరణ, భూమి క్షీణత పై నిర్వహించిన సర్వేపై.. వివరాలు తెలిపిన మంత్రి... దేశంలోనే అత్యధికంగా జార్ఖండ్ - 68.7, రాజస్థాన్ - 62.06, ఢిల్లీ - 61.73, గోవా - 52.6 శాతం ఎడారీకరణను ఎదుర్కొంటుంటే.. వాటి తర్వాత గుజరాత్ - 52.22 ఎడారీకరణను ఎదుర్కొంటున్నట్లుగా వెల్లడించారు. అడవులను తోటలుగా మార్చడం వంటి అశాస్త్రీయ భూ వినియోగ మార్పులు సమస్యను తీవ్రతరం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇదే విషయంపై ఇప్పటికే.. వివిధ అంశాలను పరిశీలిస్తున్న కేరళ రాష్ట్ర జీవవైవిధ్య బోర్డు నిపుణులు.. కేరళలో ఈ తోటలుగా మారుతున్న అడవుల శాతం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే.. కొండచరియలు విరిగి పడటం వంటి సహజ ప్రమాదాలు కూడా ఈ సమస్యకు పెంచుతున్నాయని అంటున్నారు.




## అమెరికాకు కరెంటు కోతలు
# కెనడా రివేంజ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిక్కనిర్ణయాలతో ప్రపంచంలోని దేశాలకు సుంకాల దరువువేస్తుండగా, ఇతర దేశాలు కూడా మేం తగ్గేదెలే అంటూ షాకులిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత, మిత్రులు, శత్రువులు అని తేడా లేకుండా ట్రంప్ అందరిపైనా సుంకాలు విధించడం ప్రారంభించారు. ఇప్పుడు పొరుగు దేశమైన కెనడా పైనా 25 శాతం టారిఫ్ విధించారు. దీనికి ప్రతిస్పందనగా కెనడా పెద్ద రివేంజ్ కు ప్లాన్ చేసింది. యుఎస్ పై ఒంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్ తీవ్ర హెచ్చరికలు చేశారు. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్లింక్ తో ఉన్న 100 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కెనడా పై ట్రంప్ విధించిన 25 శాతం సుంకాలు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో కెనడా ఇంధన ఎగుమతులపై 10 శాతం టారిఫ్ ఉంది. ఈ నిర్ణయాలు కెనడా నేతలను తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. తాము ఆర్థికంగా దెబ్బతింటున్నామని చూస్తూ కూర్చోబోమని డగ్ ఫోర్డ్ స్పష్టం చేశారు. ''వారు ఒంటారియోను ధ్వంసం చేస్తుంటే.. చూస్తూ ఊరుకోను. చిరునవ్వుతోనే చేయాల్సిందంతా చేస్తాను. కరెంట్ కోతలు విధిస్తాను. ఒంటారియోతో స్టార్లింక్ కు ఉన్న 100 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని రద్దు చేస్తున్నాను. అది పూర్తయింది. ఆయన కెనడా ప్రజలను తక్కువ అంచనా వేస్తున్నారు. మా స్టోర్ల నుంచి యుఎస్ ఆల్కహాల్ ను తొలగించాలని యోచిస్తున్నాం'' అని ఫోర్డ్ వెల్లడించారు. అమెరికాకు అత్యధిక ఇంధన ఎగుమతులు కెనడా నుంచే వెళ్తున్నాయి. కెనడాకు చెందిన ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, హైడ్రోపవర్, సహజ వాయువు, ఎలక్ట్రిసిటీ పై యుఎస్ ఆధారపడింది. ''వారు మా ఇంధనంపై ఆధారపడ్డారు. వాళ్లు కూడా నొప్పి భరించాలి'' అని ఫోర్డ్ వ్యాఖ్యలు చేశారు. చిరకాల మిత్ర దేశంపై ట్రంప్ అసలు సుంకాలు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ''సన్నిహిత మిత్రులు, పొరుగువారిపై ఎందుకు దాడి చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. కెనడా పై సుంకం అంటే అమెరికన్ల పై పన్ను విధించడం కిందికే వస్తుంది'' అన్నారు.

## జీవితంలో సుఖమే కాదు కష్టం కూడా భాగమే, ఈ భూమిపై కష్టం లేని జీవి ఏదో చెప్పండి?



చిన్న సమస్యకి అల్లాడిపోతూ విలవిల్లాడి పోయేవారు ఈ భూమిపై ఎంతోమంది ఉన్నారు. వారంతా కూడా కేవలం మనుషులే. జంతువులేవి కూడా తనకొచ్చిన కష్టాన్ని చూసి పొరలి పొరలి ఏడవవు. తలుచుకొని తలుచుకొని కుమిలి పోవు. ఆ క్షణాన్ని అక్కడే వదిలేసి ముందడుగు వేస్తాయి. జీవితంలో మరిన్ని మజిలీలను వెతుక్కుని ముందుకు సాగుతాయి. కానీ మనిషి మాత్రం కష్టం రాగానే అక్కడే ఆగిపోతాడు. కుమిలి కుమిలి ఏడుస్తూ ముందడుగు వేయడు.

**ఎందుకీ జీవితం?**

ఒక ఊరిలో ఒంటరిగా జీవిస్తున్న రాము అనే యువకుడు ఉన్నాడు. అతడికి ప్రతిరోజూ అడవిలోకి వెళ్లడం అలవాటు. అక్కడ ఉన్న చెట్లను, జంతువులను, పక్షులను చూసి చాలా ఆనందపడేవారు. అవి కలిసిమెలిసి జీవించడం అతనికి నచ్చేది. తనకి చిన్న కష్టం వచ్చినా కూడా చూసేవారు లేరని తెగ బాధపడేవాడు. అదే ఏ పక్షిగానో, జంతువుగానో పుడితే బాగుండేమో అనుకునేవాడు. అడవిలో అన్ని జీవులతో కలిసి హాయిగా జీవించవచ్చని భావించేవాడు. ఒకరోజు ఆయనకి ఆరోగ్యం పాడైంది. కనీసం లేవలేకపోయాడు. ఆ క్షణంలో జీవితం పైనే విరక్తి వచ్చింది. ఎందుకీ బతుకు? అడివిలో ఏ జంతువుగా మారినా బాగుణ్ను.. అనుకున్నాడు. అలా అనుకున్నాడో లేదో చిన్న మొక్కలా మారిపోయాడు. తనను తాను మొక్కలా చూసి మురిసిపోయాడు. గాలికి ఇటూ అటూ ఊగుతూ ఉంటే ఆనందపడ్డాడు. ఈలోపు ఎక్కడినుంచి వచ్చిందో ఏనుగుల గుంపు వచ్చి ఆ మొక్కను తొక్కుకుంటూ పోయింది. ఆ క్షణం రాము మళ్ళీ అనుకున్నాడు. మొక్కల కన్నా అలా చెంగుచెంగున ఎగిరే ఏ కుందేలుగానో మారితే బాగుండు అని. అలా అనుకున్నాడో లేదో అప్పుడే కుందేలులా మారిపోయాడు. తనకు నచ్చినట్టు అడవిలో గెంతులు వేశాడు. ఈ లోపు ఒక గుంట నక్క అటుగా వచ్చింది. కుందేలును తరమడం మొదలుపెట్టింది. బతుకు జీవుడా అని పరుగెందుకుంది. ఈ లోపు మరో కుందేలు నక్కకు దొరికిపోయింది. దాన్ని చూసి భయంతో వణికి పోయాడు రాము. ఈ కుందేలు రూపం వద్దు బాబోయ్ చక్కగా పెద్ద చెట్టుగా మారితే బాగుండు, అందరూ తనకిందే వచ్చి నిల్చుంటారు అనుకున్నాడు. అలా అనుకున్నాడో లేదో చెట్టుగా మారాడు. ఓ రోజు పెద్ద గాలి వాన వచ్చి చెట్టు పటపట విరిగిపోయింది. అంతే చెట్టు రూపంలో ఉన్న రాజుకు ఒక్కసారిగా పిడుగు పైన పడినట్టు అనిపించింది. ఆ వెంటనే ఏ గాలిలో తిరిగే పక్షిగానో మారితే సమస్య ఉండదు కదా అనుకున్నాడు. ఇలా కోరుకున్నాడో లేదో అలా పక్షిగా అయిపోయాడు. ఒక చెట్టుపై గూడు కట్టుకొని పక్షి పిల్లలతో ఆనందంగా ఉన్నాడు. నాలుగు రోజులు సంతోషంగా ఉన్నాడు. ఈలోపు కింద నుంచి ఓ పాము చెట్టుపైకి పాక్కుంటూ వచ్చి ఆ గుడ్లను మింగేసింది. అలాగే ఓ గ్రద్ధ వచ్చి పక్షి రూపంలో ఉన్న రాజును తన్నుకు పోవడానికి చూసింది. వెంటనే గజగజ వణికిపోయాడు. ఈ పక్షిరూపం నాకొద్దు... ఏ జీవిగా మారినా ఏదో ఒక కష్టం వెంటాడుతూనే ఉంది, మనిషిగా ఉంటేనే మంచిదేమో అని అనుకున్నాడు.

**ఎవరికి లేవు కష్టాలు?**

చివరికి మనిషిగా మారాడు రాము. కష్టాలు ప్రతి జీవికి ఉంటాయని మొక్క నుంచి మాను వరకు చీమ నుంచి ఏనుగు వరకు అన్నింటికీ వాటి స్థాయిలో ఇబ్బందులు, ఆపదలు వస్తూనే ఉంటాయని అర్థం చేసుకున్నాడు. జంతువులు అడవిలో ప్రతిరోజు ప్రాణ పోరాటాన్ని చేస్తాయని తెలిసింది. తన జీవితంలో కూడా తాను పోరాడాల్సిందేనని నిర్ణయించుకున్నాడు. ఇది రాము గురించి మాత్రమే కాదు చిన్న కష్టానికి తెగ బాధపడే అందరికీ వర్తిస్తుంది. దూరపు కుండలు నునుపు... అలాగే ఒకరి జీవితంలోకి వెళ్లి కొన్ని రోజులపాటు అలా జీవిస్తేనే వారి కష్టాలు అర్థం అవుతాయి. దూరం నుంచి చూస్తే వారు ఆనందంగా ఉన్నారు అనుకుంటారు. సెలబ్రిటీలను, కోటీశ్వరులను చూసి కూడా అలాగే భావిస్తారు. కానీ ఎవరికి ఇవ్వాల్సిన కష్టాలను, సమస్యలను దేవుడు వారికి ఇస్తూనే ఉంటాడు. మనిషిగా జీవించాలంటే వాటిని తట్టుకొని ముందుకు సాగాల్సిందే.

## ఇంట్లో ఉన్న ఒక పాత గది.. 500 రూపాయల పెట్టుబడితో
# నెలకు 2 లక్షలు సంపాదిస్తున్న గ్రామీణ మహిళ



ఆమెకు చదువు లేదు.
పదిహేనేళ్ల పెళ్లి చేశారు.
పెళ్లయిన తర్వాత అత్తారింట్లో వంటగదికే పరిమితమైంది. అత్తమామల నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేదు. అయినా ఆమె మనసులోని కోరిక చావలేదు. చివరికి భర్త సాయంతో తను అనుకున్నది సాధించింది.
ఇప్పుడు ఆమె ఇంట్లోనే ఉండి రెండు లక్షల రూపాయలు సంపాదిస్తోంది.
అంతేకాదు తనలాంటి పదివేల మంది మహిళలకు శిక్షణను కూడా ఇచ్చింది.
ఒక మహిళ జీవితంలో ఇంతకన్నా పెద్ద విజయం ఇంకేముంటుంది?
ఆమె పేరు ప్రతిభ ఝా. బీహార్లోని దర్భంగా ప్రాంతానికి చెందిన ఒక ఇల్లాలు. ఆమె పుట్టిల్లు ముజఫర్పూర్లో ఉంది. తన ఊర్లోనే రైతులను చూస్తూ పెరిగింది ప్రతిభ. పుట్టగొడుగులు పండించడం కూడా చూసింది. అవంటే చిన్నప్పుడు నుంచి ఆసక్తి ఎక్కువగా ఉండేది. అవి ఎలా పెరుగుతాయో, ఎలా పెంచుతారో అన్న ఆసక్తి ఆమెలో ఎప్పటికప్పుడు వచ్చేది.

### తండ్రి మరణం

కానీ ఆమె జీవితం అకస్మాత్తుగా మలుపు తిరిగింది. ఆమె తండ్రి మరణం ఆమెకు ఆనందాన్ని దూరం చేసింది. తండ్రి లేని కూతురు కావడంతో 15 ఏళ్ల వయసులోనే పెళ్లి చేశారు. గ్రామంలో ఉన్న తన భర్త ఇంట్లోనే ఆమె అత్తమామలతో కలిసి జీవించేది. వంట, ఇంటి పనులు తప్ప ఇంకేమీ చేసేది కాదు. కానీ పుట్టగొడుగుల పెంపకం అనేది మాత్రం ఇంకా ఆమె మెదడులో మెదులుతూనే ఉంది.

### వద్దన్న అత్తామామలు

పిల్లలు పుట్టి వారు స్కూలుకు వెళ్లే వయసు వచ్చింది. ఆ సమయంలో ఆమెకు మళ్ళీ పుట్టగొడుగులను పెంచాలన్న ఆసక్తి కలిగింది. ఇదే విషయాన్ని అత్తమామలతో చెప్పింది. కానీ వారు కొంచెం కూడా ఆమె ఆలోచనకు విలువ ఇవ్వలేదు. ఇంటి పనులు, వంట పనులు చూసుకోమని కఠినంగా చెప్పారు. తన భర్తతో కూడా ఇష్టాలను చెప్పింది. అతను తనకి పుట్టగొడుగుల పెంపకం గురించి ఏమీ తెలియదని, ఖాళీ సమయాల్లో ప్రయత్నించమని చెప్పాడు. ఆ చిన్న మద్దతే ఆమెకు కొండంత విజయాన్ని అందించేలా చేసింది. ఎక్కడ పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇస్తారో తెలుసుకుంది ప్రతిభ. 2017లో శిక్షణ తీసుకోవడానికి దర్భంగా వ్యవసాయ యూనివర్సిటీకి వెళ్ళింది. కానీ అక్కడ వీలు కాలేదు. చివరికి బీహార్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చేరుకుంది. కానీ అప్పటికే ఒక బ్యాచ్‌కు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ పూర్తయిందని చెప్పారు. మరొక ఏడాది పాటు వేచి ఉండమని చెప్పడంతో ఆమె ఆశగా అలా ఏడాది పాటు మళ్ళీ శిక్షణ కార్యక్రమం కోసం వేచి ఉంది. 2016లో అధికారికంగా శిక్షణను తీసుకుంది. పుట్టగొడుగుల పెంపకం గురించి ఆమెకు అవగాహన వచ్చింది.

### పాత గదిలోనే మొదలు

తన ఇంట్లోనే ఒక ఖాళీగా ఉన్న గదిని తన మొదటి పుట్టగొడుగుల పెంపకం కేంద్రంగా ఉపయోగించుకుంది. అప్పుడు ఆమె చేతిలో ఉన్నది కేవలం 500 రూపాయలు. 500 రూపాయలతోనే ఆయిస్టర్ పుట్టగొడుగుల సీడ్స్ కొనుగోలు చేసింది. ఆ గదిలోనే పుట్టగొడుగులను పంటను అభివృద్ధి చేసింది. మొదటిసారి 20 ప్యాకెట్ల ఆయిస్టర్ పుట్టగొడుగులు వచ్చాయి. అవి వెయ్యి రూపాయలకు అమ్మి ఆదాయం చేసుకుంది. వచ్చిన మొత్తం తక్కువే కావచ్చు. కానీ ఆమె పుట్టగొడుగులను పెంచగలనన్న విశ్వాసాన్ని పెంచుకుంది. మొదటి సంపాదన ఆమెలో ఎంతో ధైర్యాన్ని నింపింది.

### ఆదాయం ఇలా పెరిగింది

పుట్టగొడుగుల సీడ్స్ కొనడమే ఆమెకు చాలా ఇబ్బందిగా మారింది. దీంతో ఢిల్లీలోని విశ్వవిద్యాలయానికి వెళ్లి 15 రోజులు పాటు శిక్షణ తీసుకుంది. సొంతంగా మష్రూమ్ సీడ్స్‌ను ఎలా తయారు చేయాలో నేర్చుకుంది. అప్పటినుంచి ఆమె వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. తక్కువ పెట్టుబడితోనే పుట్టగొడుగుల సీడ్స్ ను తయారు చేయడం ప్రారంభించింది. అలాగే వాటితో పుట్టగొడుగులను పెంచడం, ఆ సీడ్స్ అమ్మడం వంటివి కూడా చేసింది దీంతో లాభాలు పెరగడం ప్రారంభమయ్యాయి. ఆయిస్టర్ పుట్టగొడుగులు, మిల్కీ పుట్టగొడుగులు పెంచడం ప్రారంభించింది.

### నెలకు రెండు లక్షల రూపాయలు

ఆమె పురోగతిని చూసి ఇంట్లో వారు కూడా మద్దతుని ఇవ్వడం ప్రారంభించారు. మొదట్లో ఈమెను చూసి నవ్విన గ్రామ ప్రజలు తర్వాత ఈమె దగ్గరకు వచ్చి సలహాలు, సూచనలు తీసుకోవడం మొదలు పెట్టారు. ఎంతోమంది మహిళలు పుట్టగొడుగుల శిక్షణను కూడా తీసుకున్నారు. పుట్టగొడుగులు ఎక్కువ మొత్తంలో పండించి వాటిని ఎండబెట్టి మార్కెట్లో అమ్మడం ప్రారంభించింది. దీంతో సంపాదన కూడా పెరిగింది. పుట్టగొడుగులతో రకరకాలుగా మార్కెటింగ్ చేయడంతో ఆమెకి నెలకు రెండు లక్షల రూపాయలకు తగ్గకుండా ఆదాయం రావడం మొదలైంది. స్థానిక మార్కెట్లో పుట్టగొడుగులను కిలో 40 రూపాయలకు అమ్ముతుంటే... ఈమె మాత్రం 20 రూపాయలకి అమ్మేది. ఎందుకంటే మొదట లాభంపై దృష్టి పెడితే జనాల్లోకి తాను పండించిన పుట్టగొడుగులు వెళ్లడం కష్టంగా మారుతుంది. అందుకే కస్టమర్ల నమ్మకాన్ని పొందేందుకు తక్కువ ధరకే అమ్మి వారిని తనవైపు తిప్పుకుంది. చివరికి ఆమె పుట్టగొడుగులని కొనేందుకు స్థానిక మార్కెట్లలో పోటీ ఎక్కువైంది. ప్రజలు నేరుగా ఈమెకు ఫోన్ చేసి కూడా ఆర్డర్లు ఇవ్వడం ప్రారంభించారు. నాణ్యత విషయంలో ఈమె ఏ మాత్రం రాజీపడదు.

### పుట్టగొడుగుల ట్రైనింగ్

పుట్టగొడుగుల పెంపకంలో తాను విజయం సాధించడంతో తనలాంటి ఎంతోమంది మహిళలకు చేయూత ఇచ్చేందుకు నిర్ణయించుకుంది. 2018లో తన గ్రామంలోనే పుట్టగొడుగుల పెంపకం శిక్షణను ప్రారంభించింది. దీనికి దర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు కూడా మద్దతు ప్రకటించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారు మష్రూమ్ సీడ్స్ ను కూడా కొని తీసుకెళ్లేవారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కూడా డిమాండ్ పెరిగింది. ఒక మనిషికి రూ. 500 చొప్పున వసూలు చేసి శిక్షణను ఇచ్చేది. ఇప్పుడు 1200 రూపాయలకు పెరిగింది. ప్రతిరోజు శిక్షణా కార్యక్రమాలను ఆమె నిర్వహిస్తోంది. తద్వారా కూడా ఆమె ఆదాయం రెట్టింపు అయిందని చెప్పుకోవచ్చు .
ఇప్పటివరకు పదివేల మందికి పైగా రైతులకు పుట్టగొడుగులపై శిక్షణ ఇచ్చింది. వ్యాపారం విషయంలో మొదటి అడుగు వేయడానికే భయం వస్తుంది. అలా భయపడవద్దని చెబుతోంది ప్రతిభ. ఆమె కేవలం శిక్షణ కార్యక్రమాల నుండి నెలకు 50 వేల రూపాయల వరకు సంపాదిస్తోంది. అలాగే పుట్టగొడుగుల సీడ్స్ అమ్మడం ద్వారా మరో లక్ష రూపాయలు ఆర్జిస్తోంది. ఇక పుట్టగొడుగులను అమ్మి మరొక 50వేల వరకు సంపాదిస్తోంది. పుట్టగొడుగులతో ఊరగాయలు, అప్పడాలు, స్నాక్స్ వంటివి కూడా చేసి అమ్మడం మొదలు పెట్టింది. ఇప్పుడు అవి కూడా లాభాలను తెచ్చిపెడుతున్నాయి .

సంకల్పం ముందు ఎలాంటి ఇబ్బందులు ఆమెకు అడ్డంకులుగా అనిపించలేదు. అందుకే పుట్టగొడుగుల వ్యాపారంలోకి రావడానికి ఎన్నో కష్టాలు పడ్డానని ప్రతిభ చెప్పడం లేదు. ఇష్టమైన పని కష్టంగా అనిపించదని చెబుతోంది. చేతిలో 500 రూపాయలతో మొదలుపెట్టిన వ్యాపారం ఇప్పుడు తనకు నెలకు 2 లక్షల రూపాయలు ఇస్తోందంటూ గర్వంగా చెబుతోంది. ఆమె భర్త, అత్తమామలు కూడా ప్రతిభను చూసి ఎంతో గర్విస్తున్నారు.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
9247580946

# సీఎం పర్యటనను విజయవంతం చేయండి

- సీఎం చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- శాఖల వారీగా సంబంధిత పనులను వేగవంతం చేయండి



**జనగామ, మహా;** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. ఈ నెల 16న సీఎం రేవంత్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో దాదాపు 800 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన పనులపై జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆర్డీఓలు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులతో జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దాదాపు 800 కోట్ల రూపాయలతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని, అందుకు సంబంధించిన వాటికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందన్నారు. వంద పడకల ఆసుపత్రి, యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బంజారా భవన్, సమీకృత రెవెన్యూ డివిజన్ కార్యాలయ సముదాయం, విద్యుత్ డివిజన్ కార్యాలయం, 5 సబ్ స్టేషన్లు, ఏడు మండలాల వారీగా ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్లు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా మంజూరైన రోడ్లకు, చిల్పూర్, వేలేరు మండలాల్లో ఎంపీడీఓ కార్యాలయలకు, ఆయిల్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్, బంజారా భవన్, ఐటీడీఏ రోడ్ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారని, అలాగే స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ లక్షణం ప్రారంభించినట్లు తెలిపారు. ఇందుకు గాను ప్రణాళికాబద్ధంగా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. వీటితో పాటు మహిళా సాధికారత దిశగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సౌర విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్ లకు శంకుస్థాపనకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయడానికి మొట్టమొదటిసారిగా పర్యటించనున్న రేవంత్ రెడ్డి పర్యటన అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కేంద్రంలో జఫర్గడ్ రోడ్ లోని ఫ్లై ఓవర్ కలరింగ్, రైల్వే అండర్ పాస్ రోడ్డు మరమ్మతు పనులు, అంబేద్కర్ సర్కిల్ సుందరీకరణ నలు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా మాట్లాడుతూ.. పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఆయా పనులను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందని వెల్లడించారు. అలాగే తగు జాగ్రత్తలతో అన్ని ఏర్పాట్లను పక్కాగా నిర్వహించాలని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపిరామ్, వెంకన్న, ఏసీపీ భీం శర్మ, పీడీ డిఆర్డిఓ వసంత, డిఏంహెచ్ఓ మల్లికార్జున రావు, డిపిఓ స్వరూప, హౌసింగ్ పీడీ మాతృ నాయక్, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ వేడుకల్లో కంది మౌనా శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** పెళ్లిళ్ల సీజన్ లో కళ్యాణ వేదికలన్నీ కళకళలాడుతున్నాయి.ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పై అభిమానంతో ఆహ్వానించిన వారి వివాహాది శుభకార్యాలకు ఆయన తరపున ఆయన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. కళ్యాణ మండపాలలో మిత్రులు , శ్రేయోభిలాషులు అభిమానులను ఆప్యాయంగా పలకరించారు. పట్టణంలోని పలు పంక్షన్ హాళ్ల లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులు అనూష సందీప్,బొజ్జ వార్ అజయ్ ప్రవళిక,అనూష గణేష్,గేడం సాయికృష్ణ కిరణ్ కుమారి , పందరి గణేష్ రుత్విక లను ఆశీర్వదించి కంది శ్రీనన్నపెళ్లి కానుకలను బహుకరించారు.ఆమె వెంట శ్రీలేఖ ఆదివాసీ,దేశెట్టి ప్రభావతి,ఎం.ఏ కయ్యుమ్ తదితరులు హాజరయ్యారు.



## ఓం శాంతి నిలయంలో ఉచిత మెడికల్ క్యాంప్

- ముఖ్య అతిథిగా హాజరైన కంది మౌనా శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** మన దైనందిన జీవితంలో ఆరోగ్య సమస్యలు వెంటాడుతుంటాయని, ఆర్థిక స్థోమతలేని కారణంగా కొందరు ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటోందని, అలాంటివారి కోసం ఇలా ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం ఓం శాంతి నిలయంలో మహారాష్ట్ర లోని ఆచార్య వినోభాబావే గ్రామీణ ఆసుపత్రి వార్ధా వైద్య బృందం సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్వాహకులు ఆమెకు ఘన స్వాగతం పలికి జ్ఞాపికతో సత్కరించారు. క్యాంపును సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైనవారు ఉచితంగా మందులు తీసుకెళ్లాలని సూచించారు.వైద్యులు దేవుళ్లతో సమానమని, ప్రతిఒక్కరి జీవితంలో వారి పాత్ర ఎనలేనిదని కొనియాడారు. అదేవిధంగా మానసిక ఒత్తిళ్ల నుండి బయటపడేందుకు ఓంశాంతి నిలయం ఒక దివ్య క్షేత్రమని ఇక్కడకు వచ్చి ధ్యానం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రేణుకా బహెన్, ఓంశాంతి సభ్యులు ,శ్రీలేఖ,లతా టీచర్,దేశెట్టి ప్రభావతి, సోనియా మంథని,ఖయ్యూం వైద్యులు ,సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

## బీజేపీ విజయోత్సవ సంబరాలు



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ పరిధిలోని బిజెపి ఆధ్వర్యంలో, కరీంనగర్, మెదక్,నిజామాబాద్, ఆదిలాబాద్, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ, పట్ట బద్రులఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులు గెలిచిన సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో బాణసంచ కాల్చి మిఠాయిలు పంచి విజయోత్సవ సంబరాలు నిర్వహించుకోవడం జరిగినది, ఈ సందర్భంగా మోత్కూర్ పట్టణ అధ్యక్షులు చాడ మంజుల, సీనియర్ నాయకులు, కొనతం నాగార్జున రెడ్డి, శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ, చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఉపాధ్యాయులు మేధావులు పట్ట బద్రులుభారతీయ జనతా పార్టీకి అవకాశం ఇవ్వడం జరిగినది, రాబోయే రోజుల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరేస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు, పోచం సోమయ్య, పట్టణ నాయకులు, చేకూరి మల్లేశం, కందుకూరి ప్రకాష్, మోత్కూర్ బ్రహ్మచారి, లింగాల శ్యాంసుందర్ రెడ్డి, జినుకల దశరథ, మధు సోమేశ్వరి పొలకం శివ ఏషాబోయిన రమణ తీగల శ్రీధర్ గౌడ్ తదితరులు, పాల్గొన్నారు,

## భరతనాట్యంలో బిట్స్ విద్యార్థినికి విశ్వ కళాంజలి అవార్డు

**ములుగు, మహా :** భరతనాట్యంలో ములుగులోని బిట్స్ పాఠశాల విద్యార్థి గోగినేని జోషితకు విశ్వకళాంజలి అవార్డు లభించినట్లు ప్రిన్సిపల్ గిరగాని కవిత తెలిపారు. ఇటీవల హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో శ్రీ శాంతి కృష్ణా సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య పోటీల్లో భరతనాట్యం విభాగంలో జోషితకు అవార్డు లభించింది. గురువారం విద్యార్థిని జోషితతోపాటు తల్లి దండ్రులను ప్రిన్సిపల్ కవిత అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు వివిధ రంగాల్లో రాణించాలని, దాని ద్వారా సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓఆర్ఆర్ పై ప్రమాదం.. ముగ్గురు వ్యక్తులు దుర్మరణం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరగడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. రంగారెడ్డి జిల్లా, ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని, రావిర్యాల గ్రామ సమీపంలో, ఔటర్ రింగ్ రోడ్డుపై పెద్ద అంబర్ పేట్ నుండి గచ్చిబౌలి వైపు వెళ్తున్న బ్రీజా కార్, రావిర్యాల ఎగ్జిట్ 13వద్ద, అతి వేగమే కారణంగా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అవుటర్ పై చెట్లకు నీళ్లు పడుతున్న టాంకర్ ను, అది వేగంగా వచ్చిన బ్రీజా కారు ఒకసారిగా ఢీ కొట్టడంతో ఘోరమైన ప్రమాదం జరిగింది. ఘటన స్థలానికి చేరుకున్న ఆదిభట్ల పోలీసులు, ప్రమాదంలో కారు డ్రైవర్ బత్తిని కృష్ణారెడ్డి(45) సంవత్సరాలు హస్తినాపురం అరుణ ఆసుపత్రిలో చేర్పించి, అతనికి చికిత్స అందిస్తున్నారు. కారులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి కె రవీందర్ రెడ్డి(50), వాటర్ మ్యాన్ చనమోని రాములు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరి మృతదేహాలను ఇబ్రహీం పట్నం మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

- పేలపూడి వెంకటేశ్వర్లు

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్క మున్సిపల్ పరిధిలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పై చిల్లర, మల్లర మాటలు మాట్లాడిన వారికి తగిన బుద్ధి చెప్పవలసి వస్తాది.గత బిఆర్ఎస్ పాలనలో వీరంతా వసూల్ బ్యాచ్ , ఈ వసూల్ బ్యాచ్ ఒక దళిత ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి మీదా, ఎమ్మెల్యే నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, తుంగతుర్తి నియోజవర్గాన్ని అభిరుద్ధి పథంలో ముందు వరుసలో ఉంచుతున్న జన నాయకునిపై నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తస్మాత్ జాగర్త అని హెచ్చరించినరు.గత పది సంవత్సరాలలో మీరు చేసిన అభిరుద్ధి ఏమి లేదు, ఇసుక, భూ కబ్జాలు తప్ప మీరు జనాలకు చేసింది ఏమిలేకనే మొన్న జరిగిన ఎలక్షన్ లో సొల్లు సొల్లు కాదు పొల్లు పొల్లు గా ఓడిపోతిరి ఇంకా మాట్లాడానికి మీ మతి భ్రమించి సొల్లు సొల్లు మాట్లాడుతున్నారు. మీ పాలనలో బూనాది కానీ కాల్వను మరిచిపోతే, ఎమ్మెల్యే సామేలు వచ్చిన 15 నెలల కాలంలోనే రూ. 267 కోట్ల రూపాయలు మంజూరు చేసిన ఘనత మన ఎమ్మెల్యే మందుల సామేలు ది.మీరు మాజీ ఎమ్మెల్యే ని కలిపివ్వడం కోసం రైతుల దగ్గర డబ్బులు తీసుకున్న మాట నిజం కదా... రాజకీయం లో అవినీతి ఆగడలు చేసి, నేడు నిజాయితీ పాలన అందిస్తున్న నాయకుని పై మీ విమర్శంచే స్తాయి ఉందా. రా, అంబెద్కర్ చౌరస్తా వద్దకు చర్చకు మేము సిద్ధాం, మీరు సిద్ధమా. ఈ కార్యక్రమం లో మాజీ మున్సిపాలిటీ చైర్మన్ గుర్రం కవిత లక్ష్మి నర్సింహా రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, రాచకొండ బాలరాజు గౌడ్, మండల పార్టీ యూత్ ఉపాధ్యక్షులు సుంకిశాల అనిల్, మండల నాయకులు బద్దం నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ వేడుకల్లో కలెక్టర్




**హనుమకొండ మహా :** మహిళలు నిర్వహణ పదవుల్లో సమర్ధవంతంగా రాణించ గలుగుతారని అని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో మార్చి 6వ తేది ఉదయం మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. భిక్షాలు అధ్యక్షతన నిర్వహించిన ముందస్తు "మహిళా దినోత్సవ సంబరాల" లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి విచ్చేసి ప్రసంగించారు. విశ్వవిద్యాలయ మహిళా అధ్యాపకులు అడ్మినిస్ట్రేషన్ లో ఉన్నారని, మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు, మహిళా అన్ని రంగాలలో రాణించాలని, మహిళా సాధికారత విద్య ద్వారానే సాధ్యం అన్నారు. విశిష్ట అతిథిగా విచేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మహిళలు మల్టీ టాస్కర్స్ అన్నారు. మహిళ లు ధైర్యంతో ముందుకు వెళ్లాలని డైనమిక్ గా ఉండాలని అన్నారు. విజయానికి షార్ట్ కట్స్ లేవు తెలివితేటలను జాగ్రత్తగా వాడుకోవాలని అన్నారు. విజయ పధాన్ని ఎంజాయ్ చేయాలని తల్లి తండ్రులను ఎప్పుడు మరువవద్దని సూచించారు. ప్రపంచాన్ని శాసించే స్థాయి కి భారతీయ యువత ఉందని అన్నారు, భారతీయ సంప్రదాయాలను, కట్టు బాట్లను గౌరవించాలి అన్నారు. విజయం ఒక మానసిక స్థితి అన్నారు. గౌరవ అతిధిగా విచేసిన పాలక మండలి సభ్యులు డాక్టర్ బి. రమ మాట్లాడుతూ మహిళల్లో మానసిక స్థిరత్వం ముఖ్యం అన్నారు, టెక్నాలజీ లో చాల జాగ్రత్త వ్యవహరించాలి అన్నారు, విశ్రాంత తెలుగు విభాగ ఆచార్యులు ఆచార్య కాత్యాయనీ విద్మేహి మాట్లాడుతూ శ్రామిక వర్గాల పోరాట ఫలితమే మహిళా దినోత్సవం అన్నారు, సంఘటితం గా స్త్రీ వాద హక్కులను పరిరక్షించుకోవాలి అన్నారు, మహిళలు ప్రశ్నించే తత్వం పెంచుకోవాలి అన్నారు, ఈ కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ టి. స్వప్న కన్వీనర్ గా వ్యవహరించగా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థిని లు పాల్గొన్నారు.

## కేయూసీ ఫిల్టర్ బెడ్ ఆకస్మిక తనిఖీ చేసిన మేయర్



**మహా :** మోటార్ పంపు కు యుద్ధ ప్రాతిపదికన మరమత్తులు చేపట్టి వినియోగం లోకి తీసుకురావాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకతీయ ఫిల్టర్ బెడ్ (కే యు సి) ను మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఫిల్టర్ బెడ్ లో ఇటీవల దెబ్బతిన్న నీటి సరఫరా మోటార్ పంపు ను పరిశీలించి వినియోగం లోకి తీసుకురావడానికి ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఫిల్టర్ బెడ్ యందు గత 3 రోజులుగా పని చేయకుండా ఉన్నా మోటార్ ను పరిశీలించి కాంట్రాక్టర్ అధికారులతో మాట్లాడి నీటి కొరత రాకుండా ముందస్తు గా చర్యలు చేపట్టాలని ఎప్పటికపుడు యంత్రాల పని తీరును పరిశీలించాలని నిర్వహిస్తున్న రిజిస్టర్ ను మేయర్ పరిశీలించి సూచనలు చేశారు. ఫిల్టర్ బెడ్ ఆవరణ లోగల రాణి రుద్రమ చిత్రం గల ప్రాంతం లో గులక రాళ్ళ ను ఆకర్షణీయం గా తీర్చిదిద్ది హార్టికల్చర్ వారి సహకారం తో ఆ ప్రాంతం లో గ్రీనరీ ఏర్పాటు చేయాలని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఈలు మహేందర్, మాధవి లత, సంతోష్ బాబు, డి ఈ రాజ్ కుమార్, ఏఈలు హరికుమార్, సరిత పాల్గొన్నారు.

## గార్డెన్ పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేయండి

**వరంగల్, మహా;** కూడా ఆధ్వర్యంలో కొనసాగుతున్న కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ పనులను త్వరితంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కూడా వైస్ చైర్మన్, జి డబ్ల్యు ఎం సి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గురువారం వరంగల్ నగరం లోని కాకతీయ మ్యూజికల్ గార్డెన్ అభివృద్ధి పనుల పురోగతిని అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో కమిషనర్ పరిశీలించారు. కొనసాగుతున్న ఫౌంటెన్ పనులను పరిశీలించి సమర్ధ నిర్వహణకు పలు సూచనలు చేసి త్వరితంగా గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా భద్రకాళి చెరువులో తీస్తున్న పూడికతీతను పరిశీలించి కుడా ఆధ్వర్యంలో మూడు లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత లక్ష్యం కాగా ఇప్పటివరకు 50 వేల క్యూబిక్ మీటర్లు డిసిల్టేషన్ చేయడం జరిగిందని, వేగవంతంగా లక్ష్యాన్ని సాధించాలని అధికారులకు సూచించారు.



అనంతరం ఖిలా వరంగల్ లోని ఏకాశిల పార్కును కమిషనర్ సందర్శించి నగర ప్రజల సౌకర్యార్థం పార్కును మరింత అభివృద్ధి చేసి సౌకర్యాలు కల్పించుటకు గాను టాయిలెట్లు, కిచెన్, డైనింగ్ హాల్, ఓపెన్ థియేటర్, కాటేజీలతో పాటు చెరువు చుట్టూ బండ్ ను అభివృద్ధి చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. కమిషనర్ వెంట కుడా ప్రాజెక్టు అధికారి అజిత్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమ్రావు తదితరులు ఉన్నారు.

## ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలి

- మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య

**ములుగు, మహా :** విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలని, వ్యాయామంతోపాటు మంచి ఆహారం తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ డి.సంధ్య అన్నారు. 9వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జిల్లాలోని మల్లంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాలో మెడిటేషన్, ఆసనాలు, హెల్త్ డైట్ పై ఓరియంటేషన్ క్లాస్ లు నిర్వహించి విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రస్తుతం వేసవి కాలం నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం లీచంద్ర, ఫార్మసిస్ట్ ఉష, యోగా ఇన్స్ట్రక్టర్ రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సీనియర్ పాత్రికేయుని జన్మదిన వేడుకలు

**వరంగల్, మహా ;** గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలోని ఓ ప్రైవేట్ హాల్లో ప్రముఖ సీనియర్ పాత్రికేయుడు, మహా తెలుగు దినపత్రిక గ్రేటర్ వరంగల్ జిల్లా బ్యూరో అయిన ఈద శ్రీనాథ్ జన్మదిన వేడుకలు టీఎస్ జేయు యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్లకు అతీతంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ సీనియర్ జర్నలిస్టులు, పాత్రికేయులు పెద్ద ఎత్తున హాజరై శ్రీనాథ్ తో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోకల అనిల్ కుమార్, కంది మోహన్, మట్ట దుర్గాప్రసాద్, శ్రీధర్, ప్రభాకర్, గంగరాజు, కమటం వేణు, ఉమా శంకర్, జన్ను శ్యామ్, రాజు, నరేష్, యుగంధర్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన తోట హరీష్

**వరంగల్, మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలోని ఓ ప్రైవేట్ హాల్లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఆత్మీయులు మంచాల ఎల్లన్న వారి అక్క బిడ్డ వివాహ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవం లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోల్డెన్ డైమండ్ మర్చంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తోట హరీష్.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు, తదితరులు, పాల్గొన్నారు.

## బీజేపీ ఎమ్మెల్సీల విజయం పట్ల
# కార్యకర్తల సంబరాలు



**కాటారం, మహా :** ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎం ఎల్ సి ఎన్నికల లో బిజెపి అభ్యర్థులు విజయం సాధించడం పట్ల శ్రేణులు గురువారం సంబరాలు నిర్వహించారు. కాటారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాటారం మండల శాఖ అధ్యక్షుడు పాగే రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు చల్ల నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం ప్రధానమంత్రి మోడీ విజయమని, బీజేపీ పార్టీ ని అందరించి అఖండ మెజారిటీ ఇచ్చిన విద్యావంతులకు ధన్యవాదములు తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎం ఎల్ సి బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం రాబోయే ఎన్నికల లో బీజేపీ విజయం కి తొలి మెట్టని, ఈ ఎన్నికలలో అధికార పార్టీ డబ్బు సంచులు పంచిన కూడా విద్యావంతులు ధర్మం వైపు నిలబడినట్లు,ఈ ప్రాంతం శాసనసభ్యులు ఇసుక లారీలను బందు చేస్తానని ఈ ప్రాంత వనరులు.. ఈ విజయం స్ఫూర్తి తో గ్రామ గ్రామ నా బీజేపీ కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల లో నీళ్ళబడి అధిక స్థానాలు సాధిస్తాం అని రాబోయో రోజుల లో ఉపాధ్యాయ, నిరుద్యోగ, యువతకి సంబందించిన సమస్య లపై ఉద్యమాలు చేస్తాము అని అన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ పార్టీ మండల్ అధ్యక్షులు పాగె రంజిత్ కుమార్, ఫిల్మ్ సెన్సర్ బోర్డు మెంబెర్ దుర్గం తిరుపతి,మాజీ మండల అధ్యక్షులు బండం మల్లారెడ్డి,గంట అంకయ్య,సీనియర్ నాయకులు జిల్లెల్ల శ్రీశైలం, బొంతల రవి,డోలి అర్జయ్య, చీర్ల తిరుపతి,పరతిరెడ్డి హన్మయ్య, ఆత్మకూరి స్వామి యాదవ్, , చీర్ల అశోక్ రెడ్డి, గండు మల్లారెడ్డి,బండి రమేష్, వేముల రమేష్,పెంట మధు, కట్టేకోళ్ల పర్వతాలు,బొడ్డు ఆశయ్య, మంతెన సతీష్,ముద్రకోళ్ల సుధాకర్,గంట అంకయ్య, వెన్నగంటి మల్లారెడ్డి,ఇంజమూరి సదానందం జోడు రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సినిమా పేర్లు చెప్పి
# రూ.1.34 కోట్లు కొట్టేశాడు
### సినిమాకు డబుల్ లాభాలు ఇస్తామని..



**హైదరాబాద్, మహా:** సినిమా ప్రమోషన్ల బిజినెస్ చేస్తా అని మాయమాటలు చెప్పి కోట్లు కొట్టేశాడు ఓ కేటుగాడు. సీసీఎస్‌లో పోలీసులు విచారణలో విషయమంతా బయటకు తీశారు. హైదరాబాద్‌లో ఛత్రినాక అరుందతి కాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగి.. తన మిత్రులతో కలిసి తరచూ గోవా వెళ్లొస్తుండేవాడు. ఎప్పటిలాగే 2024 అక్టోబరులో అక్కడి బిగ్‌డాడీ క్యాసినోకు వెళ్లాడు. అందులో శ్రీలంకకు చెందిన ఇద్దరు వ్యక్తులు పరిచయమయ్యారు. వారు రిలీస్‌కు సిద్ధంగా ఉన్న సినిమాలకు ప్రమోషన్ ఈవెంట్స్ చేస్తుంటామని బాధితుడిని నమ్మించారు. అదే నెలలో ఉదయ్‌రాజ్ గచ్చిబౌలిలోని ఓ హోటల్‌కు రాగా.. బాధితుడు వెళ్లి కలిశాడు. త్వరలో విడుదలకానున్న చిత్రానికి ప్రమోషన్ చేసేందుకు అవకాశం వచ్చిందని ఉదయ్‌రాజ్ చెప్పాడు. ఓజీ సినిమా డైరెక్టర్ సుజిత్ ఫొటోలను చూపి నమ్మకం కలిగించాడు. హైదరాబాద్ వచ్చిన ఉదయ్ రాజ్‌ను వాట్సాప్ ద్వారా కలుసుకున్నాడు బాధితుడు. అమరన్ సినిమా ప్రమోషన్‌కు రూ.20 లక్షలిస్తే వారం రోజుల్లో రెట్టింపు లాభాలిస్తామంటూ హామీనిచ్చారు. రెండు దఫాలుగా ఆ ఇద్దరి బ్యాంకు ఖాతాల నుంచి.. అమరన్ సినిమాలో లాభాలు వచ్చాయంటూ రూ.25లక్షలు ఇచ్చారు. సరే డబ్బులు తీసుకొని ఇస్తున్నారు కదా అని బాధితుడి మరోసారి కూడా పెట్టుబడి పెట్టాడు. తరువాత సీతాపయనం, యూఐ, కంగువా, పుష్ప 2, గేమ్‌ఛేంజర్ సినిమాల ప్రమోషన్ పెట్టుబడి పేరిట ఆన్‌లైన్‌లో రూ.76 లక్షలు, విడతల వారీగా రూ.58 లక్షలు తీసుకున్నారు. బాధితుడు ఉప్పుగూడలోని ఇంటిని విక్రయించడంతోపాటు నగలు తాకట్టు పెట్టి, అప్పులు చేసి మొత్తం రూ.1.34 కోట్లు పెట్టుబడిగా వారికి ఇచ్చాడు. లాభాలు కాదు కదా.. అసలు కూడా ఇవ్వకుండా ఉదయ్‌రాజ్ తప్పించుకు తిరుగుతున్నాడు. మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.



## సీఎం రేవంత్ రెడ్డితో
# ఎమ్మెల్సీ భేటీ
### శ్రీపాల్ రెడ్డికి సీఎం అభినందనలు

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్ నివాసంలో వరంగల్ - ఖమ్మం - నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఎన్నికైన పింగిలి శ్రీపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి సహకరిస్తామని ముఖ్యమంత్రి కి తెలిపారు. ఈ ఎన్నికలో విజయం సాధించిన శ్రీపాల్ రెడ్డి కి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

# మార్చ్ నెల వరకు ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు
### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ


**కాటారం, మహా :** మార్చి 31 లోపు ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులకు ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీ అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో మున్సిపల్, పట్టణ ప్రణాళిక, పంచాయతి అధికారులతో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు పరిష్కరించే అంశంపై సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో మున్సిపల్ అధికారులు, పంచాయతిల పరిధిలో పంచాయతి అధికారులు సమన్వయంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చి 31 లోపు ఎల్.ఆర్.ఎస్ ప్రక్రియకు చెల్లించు మార్కెటింగ్ ఫీజు చెల్లిస్తే దరఖాస్తు దారులకు 25 శాతం రాయితి అవకాశం కల్పించినట్లు తెలిపారు. దరఖాస్తు దారులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు దారులు ఎల్ఆర్ఎస్ సిటిజన్ యాప్ https://lrs.telangana.gov.in నుండి చెల్లింపు చేసిన దరఖాస్తు దారులకు మాత్రమే ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీ వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక అధికారి సునీల్, పంచాయతి కార్యాలయ ఏఓ బుచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్మీడియేట్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

ఇంటర్మీడియట్ పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతం గురించి చీఫ్ సూపరింటెండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగా పరీక్ష నిర్వహించాలని, నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా లేదా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, అత్యవసర వైద్య సేవల కేంద్రం ఏర్పాటు, మరుగుదొడ్లు, కళాశాలలో ఎలాంటి వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను పోలీసు బందోబస్తు మధ్య క్లోజ్డ్ వాహనంలో నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని సూచించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక పరిణామం
### కెనడాలో ప్రభాకర్‌రావు, శ్రవణ్ రావు ఎక్కడంటే ?





**మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక పరిణామం చోటుచేసుకుంది. సీబీఐ ద్వారా ఇంటర్ పోల్ కు రెడ్ కార్నర్ నోటీసు పత్రాలు చేరుకున్నాయి. ఈ క్రమంలో ప్రభాకర్ రావు, శ్రవణ్ రావు అమెరికాను వదిలి వెళ్లి పోయినట్టు తెలుస్తోంది. బెల్జియంలో శ్రావణ్ రావు కెనడాలో ప్రభాకర్ రావు ఉన్నట్టు సమాచారం. తెలంగాణలో రాజకీయంగా ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో హైదరాబాద్ పోలీసులు ఇచ్చిన అన్ని పత్రాలతో సీబీఐ సంతృప్తి చెందారు. దీంతో, కేసు దర్యాప్తులో తమ వంతు సాయం అందించారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరు నిందితులపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని సీబీఐ.. ఇంటర్ పోల్ ను కోరింది. దీంతో, సీబీఐ ద్వారా ఇంటర్ పోల్ కు రెడ్ కార్నర్ నోటీసు పత్రాలు చేరుకున్నాయి. అనంతరం స్పందించిన ఇంటర్ పోల్ అధికారులు.. 196 దేశాల ప్రతినిధులను అప్రమత్తం చేయనున్నారు. అయితే, ఇప్పటికే నిందితులు ఇద్దరూ అమెరికాను వీడినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం బెల్జియంలో శ్రవణ్ రావు కెనడాలో ప్రభాకర్ రావు ఉన్నట్టు సమాచారం. కాగా, ఇంటర్ పోల్ నుంచి రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయితే ఇద్దరిని ఇండియాకు రప్పించే ప్రయత్నం లో హైదరాబాద్ పోలీసులు ఉన్నారు.

### ప్రేమ పెళ్ళికి ఒప్పుకోని పెద్దలు
# ప్రాణాలు తీసుకున్న ప్రేమికులు





**మహా :** ఇద్దరు ఒకరినొకరు ఇష్టపడ్డారు. జీవితాంతం కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉండాలని నిర్ణయించుకున్నారు. పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకొని ఒక్కటవ్వాలనుకున్నారు. ఈ విషయాన్ని పెద్దల దగ్గరకు తీసుకెళ్లగా, వారు పెళ్లికి నిరాకరించారు. పెళ్లి వద్దని ఖరాఖండిగా చెప్పేశారు. దీంతో వారు అనుకున్న జీవితం జీవించలేమని తెలిసి, వారి స్థానంలో ఇంకొకరిని ఊహించుకోలేక ఎలాగో కలిసి ఉండలేమనుకుని కలిసి ఆ ప్రేమికులు ఊరేసుకున్నారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లాలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా భూపాలపట్నంనకు చెందిన అరుణ్ (24), అలేఖ్య (21) గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అరుణ్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. పెళ్లి చేసుకుంటామని పెద్దల దగ్గరకు వెళ్లగా ఒప్పుకోలేదు. దీంతో కలిసి ఉండలేమని భావించిన ఇద్దరు, ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. గురువారం ఉదయం వావిలాలపల్లిలో తన మిత్రుడు కిరాయికి ఉంటున్న ఇంట్లో వీరిద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### అనాజిపురంలో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు పై విజయోత్సవ సంబరాలు

మోత్కూర్, మహా: యాదాద్రి భువనగిరి జిల్లా మున్సిపల్ కేంద్రంలోని బిజెపి మోత్కూర్ మండల శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్, మెదక్' నిజామాబాద్' ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ & పట్టబద్ధుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులు గెలిచిన సందర్భంగా అనాజిపురం చౌరస్తాలో బాణసంచ కాల్చి విజయోత్సవ సంబరాలు నిర్వహించుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో బిజెపి మోత్కూర్ మండల పార్టీ అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్, పాల్గొని రానున్న స్థానిక సంస్థగత,ఎన్నికల్లో జయకేతనం ఎగురవేస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో వారితో పాటు,ప్రధాన కార్యదర్శి గుంటి సతీష్, నోముల ఎంకన్న , కమ్మగాని సైదులు , నార్సింగ్ మహేష్, సాయి, శ్రీధర్ రెడ్డి, ముక్కామల గణేష్, శ్యామల నరేష్ , సిరిగల రాహుల్ చంద్ర , ముక్కామల మత్స్యగిరి, కందికట్ల అజయ్ ముక్కామల మహేష్, తదితరులు పాల్గొన్నారు,

# తాగునీటితో బైక్ క్లీనింగ్
### వ్యక్తికి రూ.వెయ్యి జరిమానా విధించిన జలమండలి
### ఎవరైనా ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎండీ హెచ్చరిక



**మహా :** జలమండలి సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించిన వ్యక్తికి అధికారులు జరిమానా విధించారు. ఈ ఘటన జూబ్లీహిల్స్ లో జరిగింది. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ ప్రధాన రహదారిపై వెళుతుండగా రోడ్ నం. 78 లో నీరు లీకేజి అయినట్టు ఎండీ గమనించి స్థానిక జీఎంను లీకేజికి కారణాలు అరాతియ్యమని ఆదేశించారు. దీంతో ఓ అండ్ డివిజన్ జీఎం హరిశంకర్ స్థానిక మేనేజర్ తో వెళ్లి పరిశీలించారు. అయితే దగ్గరికి వెళ్లి చూస్తే ఒక వ్యక్తి జలమండలి సరఫరా చేసే నీటితో బైక్ కడుగుతున్నాడు. ఇదే విషయం ఎండీకి విన్నవించారు. దీంతో ఎండీ ఆగ్రహం వ్యక్తం చేసి తాగునీటిని ఇలా ఇతర అవసరాలకు వినియోగించవద్దని చెప్పారు. అంతే కాకుండా అతనికి నోటీసు అందించి, జరిమానా వెయ్యాలని సంబంధిత జనరల్ మేనేజర్ ను ఆదేశించారు. ఎండీ ఆదేశాల మేరకు ఆ వ్యక్తికి రూ.1000 జరిమానా విధించారు. జలమండలి సరఫరా చేసే తాగునీరు ఇలా ఇతర అవసరాలకు వినియోగించద్దని ఎండీ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే.. తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జలమండలి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సుదూరు ప్రాంతాల నుంచి నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తుంది. కాబట్టి నీటిని వృథా చేయకుండా వాటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరుతోంది. ఇప్పటికే నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోగా కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. రానున్న రెండు నెలలు నీటికి ఇబ్బంది అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు తాగునీటికై సరఫరా చేసే శుద్ధమైన నీటిని వృథా చేయకూడని విజ్ఞప్తి చేస్తోంది. జలమండలి జిహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో 13.7 లక్షల నీటి కనెక్షన్లు ఉండగా ప్రతి రోజూ 550 ఎంజీడీల నీటిని ప్రజలకు సరఫరా చేస్తోంది. వెయ్యి లీటర్ల (ఒక కిలోలీటరు) నీటి సరఫరాకు రూ.48 వ్యయం చేస్తోంది. కేవలం తాగునీటి కోసం ఉద్దేశించిన రక్షిత నీటిని వాహనాలను శుభ్రం చేయడానికి, గార్డెనింగ్, ఇళ్ల పరిసరాలను కడగడానికి వృథా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటారు.



# పెంపుడు కుక్క మృతి
### కన్నీరు పెట్టుకున్న కొండా సురేఖ

**మహా :** దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విషాదంలో మునిగిపోయారు. తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కన్నీటి పర్యంతం అయ్యారు. దీనికి కారణం ఎంతో ఆత్మీయంగా, అపురూపంగా పెంచుకుంటోన్న పెట్ డాగ్ ఆకస్మికంగా మరణించడమే. దీన్ని ఆమె తట్టుకోలేకపోయారు. కన్నీటి నివాళి అర్పించారు. ఆ పెట్ డాగ్ పేరు హ్యాపీ. ఇన్ని రోజులూ తన వెంట తిరుగుతూ సందడి చేసిన హ్యాపీ శాశ్వతంగా దూరం కావడం కొండా సురేఖను తీవ్ర ఆవేదనకు గురి చేసింది. తనను వదిలి తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయిన పెట్ డాగ్‌కు ఆమె కన్నీటి నివాళి అర్పించారు. పూలు చల్లి నివాళి అర్పించారు. సాష్టాంగ నమస్కారం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అంత్యక్రియలు చేయించారు. పెంపుడు జంతువులు అంటే కొండా సురేఖకు చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే చాలా కాలంగా ఈ పెట్ డాగ్‌ను పెంచుకుంటోన్నారు. మంత్రిగా ఎంత పని ఒత్తిడిలో ఉన్నప్పటికీ ఇంటికి రాగానే తన చుట్టూ తిరుగుతూ సందడి చేసే హ్యాపీని చూస్తే మానసికంగా ఎంతో ప్రశాంతత కలుగుతుంటుందని చెప్పారు కొండా సురేఖ. హ్యాపీతో కొండా సురేఖకు ఆత్మీయ అనుబంధం ఉంది. ఈ ఉదయం ఆకస్మికంగా హ్యాపీ చనిపోవడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. కన్నీటి పర్యంతం అయ్యారు. కళేబరంపై పూలు చల్లి నివాళి అర్పించారు. కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కొండా సురేఖతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, సిబ్బంది హ్యాపీ మరణంతో ఆవేదనకు గురయ్యారు.

# డిజిటల్ యుగంలో కేసుల ఆన్‌లైన్ ఫైలింగ్ ప్రాధాన్యం
### జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు




**కాటారం, మహా :** నేటి డిజిటల్ యుగంలో కేసుల ను ఆన్లైన్ లో ఫైల్ చేయడం ప్రాధాన్యం గా మారిందని, ఈదిశగా అందరూ పయనించాలని భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి నారాయణ బాబు అన్నారు. కేసులను కోర్టు లో ఎలా ఫైల్ చేయాలి అనే అంశాల మీద జిల్లా కోర్టులో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి. నారాయణ బాబు గారు ముఖ్య అతిథిగా సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజిటల్ లిటరసీ అనేది చాల ముఖ్యం అన్నారు. కేసుల ఈ ఫైలింగ్ విధానం తెలిసినప్పుడు దేశ వ్యాప్తంగా ఎక్కడైన కేసులను వేసుకునే వీలుంటుందని తెలిపారు. విలువైన సమయం, డబ్బులు పొదుపు అవుతాయని మరియు ప్రయాణ భారం తగ్గుతుందని జడ్జి అన్నారు. రిసోర్స్ పెర్సన్లు అఖిల్ రెడ్డి, రవీందర్ రెడ్డి పి. పి. టి. ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితావని , అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనూరి సురేష్ కుమార్ , ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్ , చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీ మెరుగు రవీందర్ , స్పెషల్ పి. పి. ఎన్. విష్ణువర్ధన్ రావు , డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ శ్రీమతి అక్షయ , న్యాయవాదులు ఆనంద రావు , కనపర్తి కవిత, రవీందర్, రజినీకాంత్ , ఎన్. ప్రశాంత్ , ములుగు కోర్టు న్యాయవాదులు పాల్గొన్నారు.





### పరీక్షా కేంద్రాలను సందర్శించిన
# అదనపు కలెక్టర్

**హనుమకొండ , మహా :** హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను గురువారం సందర్శించారు. హనుమకొండ వడ్డేపల్లి లోని ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాల, హనుమకొండ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెజోనేన్స్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో చేసిన తాగునీరు, తదితర ఏర్పాట్లను గురించి అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

# పొలంలో విద్యుత్ షాక్‌తో అన్నదమ్ములు మృతి

**సంగారెడ్డి, మహా:** జిల్లాలోని జహీరాబాద్ (మం) గోవింద్ పూర్ లో విషాదం నెలకొంది. పొలంలో విద్యుత్ షాక్ తో గురువారం రాత్రి అన్నదమ్ములు మృతి చెందారు. అడవి పందుల కోసం కరెంట్ తీగలు ఏర్పాటు చేస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎరుకల జగన్(48), ఎరుకల మల్లేశం (42) పొలంలోనే మృత్యువాత పడ్డారు. మృతదేహాలు జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించగా, ఘటనపై చిరాగ్ పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.





# నెలకు 10 రోజులు
## టెక్ కంపెనీ కొత్త రూల్!




కరోనా తరువాత దాదాపు అన్ని కంపెనీలు.. వర్క్ ఫ్రమ్ విధానానికి మంగళం పాడాలని నిర్ణయించుకున్నాయి. దశల వారీగా ఈ విధానం తొలగించడానికి సిద్దమయ్యాయి. ఇందులో భాగంగానే ప్రముఖ టెక్ కంపెనీ ఇన్ఫోసిస్.. టెక్నాలజీ టీమ్, నెలలో కనీసం 10 రోజులు ఆఫీసు నుంచి పని చేయాలనే ఆదేశాలను జారీ చేసింది. ఎక్కువ మంది ఆఫీస్ నుంచే పనిచేయాలనే.. ఉద్దేశ్యంతో ఇన్ఫోసిస్ ఈ నిర్ణయం తీసుకుంది. మార్చి 10 నుంచి ఈ రూల్ అమలులోకి రానున్నట్లు తెలుస్తోంది. ప్రతి నెల.. ఆదరినీ ఆఫీసుకు రప్పించాలని, ఉద్యోగులకు అనుకూలంగా ఉండేలా.. కనీసం 10 రోజులు ఆఫీస్ నుంచి, మిగిలిన రోజులు ఇంటి నుంచి పనిచేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ విషయంపై ఇన్ఫోసిస్ అధికారికంగా స్పందించలేదు. అయితే సంస్థలో పనిచేస్తున్న 3.23 లక్షల కంటే ఎక్కువ మంది ఉద్యోగుల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి.. ఈ తరహా హైబ్రిడ్ సిస్టం ప్రవేశపెట్టినట్లు తెలుస్తోంది. ఈ కొత్త రూల్ లెవల్ 5, అంతకేనట తక్కువ స్థాయి ఉద్యోగులకు వరిస్తుందని తెలుస్తోంది. ఇందులో టీమ్ లీడర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, సీనియర్ ఇంజనీర్లు, సిస్టమ్ ఇంజనీర్లు, కన్సల్టెంట్లు ఉన్నారు. ఎవరైనా 10 రోజులు ఆఫీసుకు రానట్లయితే.. లేదా ఒకటి, రెండు రోజులు తగ్గితే.. వాటిని ఉద్యోగి సెలవుల బ్యాలెన్స్ నుంచి తీసివేసే అవకాశం ఉంది.



# వివో కొత్త 5జీ స్మార్ట్ ఫోన్
## ధర కూడా తక్కువే!

**న్యూఢిల్లీ:** హ్యాండ్‌సెట్స్ దిగ్గజం వివో (Vivo) తాజాగా టీ4 సిరీస్‌లో తొలి స్మార్ట్‌ఫోన్ టీ4ఎక్స్ 5జీని ప్రవేశ పెట్టింది. దీని ధర రూ.13,999 నుంచి రూ. 16,999 వరకు ఉంటుంది. మార్చ్ 12 నుంచి ఫ్లిప్‌కార్ట్, వివో ఇండియా ఈస్టోర్, ఇతర రిటైల్ స్టోర్స్‌లో లభిస్తుందని కంపెనీ తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్‌ల కస్టమర్లు రూ.1,000 డిస్కౌంట్ పొందవచ్చని పేర్కొంది. ఇందులో 6500 ఎంఏహెచ్ బ్యాటరీ, ఫన్‌టచ్ ఓఎస్ 15, మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ప్రాసెసర్, 50 ఎంపీ ఏఐ కెమెరా, మిలిటరీ గ్రేడ్ ప్రమాణాలు మొదలైన ప్రత్యేకతలు ఉన్నట్లు కంపెనీ తెలిపింది.

# ఖరీదైన కారు కోసం
## బుకింగ్స్ షురూ..



లెక్సస్ కంపెనీ తన 'ఎల్ఎక్స్ 500డీ' కోసం బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించింది. రెండు వేరియంట్లలో అందుబాటులో ఉండే ఈ కారు ప్రారంభ ధరలు రూ. 3 కోట్లు (ఎక్స్ షోరూమ్, ఇండియా).

కొత్త లెక్సస్ ఎల్ఎక్స్ 500డీ గంభీరమైన డిజైన్ పొందుతుంది. ఈ కారు ముందు భాగంలోని స్పిండిల్ గ్రిల్ ఎల్ షేప్ ఎల్ఈడీ సిగ్నేచర్‌లతో పెద్ద, యాంగ్యులర్ హెడ్‌లైట్‌లను పొందుతుంది. 22 ఇంచెస్ అల్లాయ్ వీల్స్ కలిగిన ఈ కారు వెనుక భాగంలో కనెక్టెడ్ టెయిల్ ల్యాంప్‌లు, చంకీ క్లాడింగ్ వంటివి ఉన్నాయి.

లెక్సస్ ఎల్ఎక్స్ 500డీ.. 12.3 ఇంచెస్ టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టం, 7 ఇంచెస్ డ్రైవ్ మోడ్ డిస్ప్లే, త్రీస్పోక్ స్టీరింగ్ వీల్, హెడ్స్‌అప్ డిస్ప్లే, ఫ్రంట్ సీట్ మసాజ్ ఫంక్షన్స్, హీటెడ్ అండ్ వెంటిలేటెడ్ ఫ్రంట్ & రియర్ సీట్లు, 4 జోన్ క్లైమేట్ కంట్రోల్, వైర్‌లెస్ ఆపిల్ కార్‌ప్లే, వైర్డు ఆండ్రాయిడ్ ఆటో, వెనుక ప్రయాణీకుల కోసం రెండు 11.6 ఇంచెస్ ఎంటర్‌టైన్‌మెంట్ డిస్‌ప్లేలు, సింగిల్ పేన్ సన్‌రూఫ్, 25 స్పీకర్ 3డీ మార్క్ లెవిన్సన్ సౌండ్ సిస్టమ్ మొదలైనవన్నీ ఉన్నాయి.

బ్లైండ్ స్పాట్ మానిటరింగ్, ప్రీకొలిషన్ సిస్టమ్, లేన్ డిపార్చర్, ట్రేస్ అసిస్ట్, సేఫ్ ఎగ్జిట్ అసిస్ట్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, అడాప్టివ్ హై బీమ్స్, 10 ఎయిర్‌బ్యాగ్‌లు, ట్రాక్షన్ కంట్రోల్, హిల్ అసిస్ట్ కంట్రోల్, ట్రైలర్ స్వే కంట్రోల్ మొదలైన సేఫ్టీ ఫీచర్స్ ఇందులో ఉన్నాయి. లెక్సస్ ఎల్ఎక్స్ 500డీ 3.3 లీటర్ ట్విన్ టర్బో డీజిల్ వీ6 ఇంజిన్ పొందుతుంది. 304 హార్స్ పవర్, 700 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. ఇంజిన్ 10 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ పొందుతుంది. ఇది ఆల్‌వీల్ డ్రైవ్, యాక్టివ్ హైట్ కంట్రోల్, స్టాండర్డ్ సెంటర్ డిఫరెన్షియల్ లాక్ మరియు అడాప్టివ్ సస్పెన్షన్‌ను పొందుతుంది.

# కొత్త నాయిస్ మాస్టర్ బడ్స్: దీని స్పెషాలిటీ ఏంటంటే..

ఇయర్ బడ్స్ వినియోగం పెరిగిపోతున్న తరుణంలో.. నాయిస్ కొత్త 'మాస్టర్ బడ్స్' ప్రారంభించింది. ఇది సౌండ్ బై బోస్ టెక్నాలజీ కలిగిన వైర్‌లెస్ ఇయర్ బడ్. మాస్టర్ సిరీస్‌లోని మొదటి ఉత్పత్తి అయితే ఈ ఇయర్ బడ్స్ అద్భుతమైన పనితీరును అందిస్తుంది. దీని డిజైన్.. ఇప్పటి వరకు మార్కెట్లో అందుబాటులో ఉన్న ఇయర్ బడ్స్ కంటే భిన్నంగా ఉంది. డ్యూయల్ డివైస్ కనెక్టివిటీ, గూగుల్ ఫాస్ట్ పెయిరింగ్ వంటి ఫీచర్స్ కలిగిన ఈ మాస్టర్ బడ్స్ మంచి లిజనింగ్ అనుభూతిని అందిస్తుంది. నాయిస్ మాస్టర్ బడ్స్ స్పెషియల్ ఆడియో సపోర్ట్‌ను కలిగి ఉంటాయి. పీక్, టైటానియం వంటి అత్యుత్తమ మెటీరియల్‌లతో తయారైన ఈ బడ్స్.. 12.4 మిమీ డ్రైవర్‌లతో అమర్చబడి ఉంటాయి. హైడెఫినిషన్ ఆడియోను మరింత పెంచడానికి, ఇయర్‌బడ్‌లు ఎల్‌హెచ్‌డీసీ (లో లేటెన్సీ హై డెఫినిషన్ ఆడియో కోడెక్) మద్దతుతో వస్తాయి. సౌండ్ బై బోస్ టెక్నాలజీతో, నాయిస్ మాస్టర్ బడ్స్ అన్ని ఫ్రీక్వెన్సీలలో.. మంచి ఆడియోను అందించేలా తయారైంది. అంతే కాకుండా 49 డెసిబుల్స్ వరకు సౌండ్ ఐసోలేషన్‌ను అందించే నాయిస్ క్యాన్సిలేషన్‌ను పొందుతాయి. మ్యూజిక్, కాల్స్ వంటివి చాలా క్లారిటీగా వినిపిస్తాయి. సాఫ్ట్ టచ్ మెటీరియల్‌లతో తయారైన నాయిస్ మాస్టర్ ఇయర్‌బడ్స్.. చెవులపై ఒత్తిడిని కలిగించవు. ఇది మూడు పరిమాణాలలో అందుబాటులో ఉంటుంది. వీటిని మీరు జిమ్‌లో ఉన్నా, ఆఫీసులో ఉన్నా లేదా ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నా రోజంతా ఉపయోగించవచ్చు. ఒక ఛార్జితో 40 గంటలు పనిచేసే దీని ధర రూ. 7999 కావడం గమనార్హం.




# దేశం-విదేశం
## NATIONAL-INTERNATIONAL

# గాజాను మరింత నాశనం చేస్తాం

## హలోనా? గుడ్‌బైనా? ఏదో మీరే నిర్ణయించుకోండి

బందీలందరిని వెంటనే విడుదల చేయండి

లేకుంటే ఒక్క హమాస్ సభ్యుడు కూడా సురక్షితంగా ఉండడు

హమాస్ కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్



**మహా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హమాస్‌కు మరోసారి తీవ్ర హెచ్చరిక చేశారు. మిగిలిన బందీలను వెంటనే విడుదల చేయాలని, లేకుంటే గాజాను మరింత నాశనం చేస్తానని బెదిరించారు. ఇదే చివరి వార్నింగ్ అంటూ ఆయన ట్రూత్ సోషల్ వేదికగా ఓ పోస్టు చేశారు. హమాస్ విడుదల చేసిన ఎనిమిది మంది బందీలతో శ్వేతసౌధంలో సమావేశమైన అనంతరం ఈ పోస్ట్ చేశారు.

'హలోనా? గుడ్‌బైనా? ఏదో మీరే నిర్ణయించుకోండి. బందీలందరిని వెంటనే విడుదల చేయండి. తర్వాత కాదు. మరణించిన వారి మృతదేహాలను తిరిగివ్వాలి. లేకుంటే తగిన ఫలితాన్ని అనుభవిస్తారు. అందుకు ఇజ్రాయెల్‌కు అవసరమైనవన్నీ పంపుతాను. నేను చెప్పినట్లు చేయకపోతే ఒక్క హమాస్ సభ్యుడు కూడా సురక్షితంగా ఉండడు. మీ చెరలో బందీలుగా ఉండి ఇటీవల విడుదలైన వారిని నేను కలిశాను. ఇదే మీకు చివరి హెచ్చరిక. గాజా ప్రజల కోసం అందమైన భవిష్యత్తు ఎదురు చూస్తోంది. మీరు ఆ ప్రాంతాన్ని విడిచిపెట్టండి' అని ట్రంప్ పేర్కొన్నారు.

మరోవైపు అమెరికా అధికారులు హమాస్ సభ్యులతో చర్చలు జరుపుతున్నట్టు శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ ధ్రువీకరించారు. కాల్పుల విరమణపై ఇజ్రాయెల్‌హమాస్ ఎటూ తేల్చుకోలేకపోతున్న తరుణంలో ఖతార్ రాజధాని దోహాలో చర్చలు జరిగినట్లు నిర్ధారించారు. అయితే చర్చల సారాంశంపై వివరాలు అందించడానికి లీవిట్ నిరాకరించారు. 1997లో అమెరికా విదేశాంగ శాఖ హమాస్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన తర్వాత తొలిసారి అమెరికాహమాస్ మధ్య ప్రత్యక్ష సమావేశం జరిగింది. హమాస్ వద్ద ఉన్న బందీలలో 24 మంది ప్రాణాలతో ఉన్నట్టు ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. వారిలో అమెరికా పౌరుడు ఉన్నట్టు వివరించారు. 35 మంది బందీల మృతదేహాలు హమాస్ వద్ద ఉన్నట్టు చెప్పారు. ట్రంప్ ఇప్పటికే అనేకసార్లు హమాస్‌కు హెచ్చరికలు చేశారు. బందీలను విడుదల చేయకుంటే అంతుచూస్తానంటూ పలుమార్లు బెదిరించారు. ఈక్రమంలో ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో గాజాలోని పరిస్థితులపై చర్చించారు. అనంతరం గాజాను స్వాధీనం చేసుకొని పునర్‌నిర్మిస్తామని ప్రకటించారు. పాలస్తీనియన్లు వేరే ఏదైనా ప్రాంతానికి వెళ్లి శాశ్వతంగా స్థిరపడాలని సూచించారు.

# దేశంలో ఉగ్రదాడులు అంతరించాయి



ప్రదాని మోదీ


**మహా:** దేశంలో ఉగ్రవాద దాడులు అంతరించాయని, నక్సలిజం కూడా చివరి దశకు చేరుకుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అడవుల నుంచి నక్సలిజం తుడిచిపెట్టుకుపోతోంది. అయితే, పట్టణ ప్రాంతాల్లో వేగంగా వ్యాపిస్తోందని, కొన్ని రాజకీయ పార్టీల సిద్ధాంతాలు నక్సలిజం భావజాలాన్ని ప్రతిబింబిస్తున్నాయని మోదీ అభిప్రాయపడ్డారు. గురువారం ఓ న్యూస్ ఛానెల్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ.. భద్రత విషయంలో తమ ప్రభుత్వం చాలా శ్రద్ధ చూపిస్తోంది. గతంలో 100 జిల్లాలు నక్సలిజం ముప్పుతో తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అయితే, ఈ సంఖ్య నేడు 12 జిల్లాలకు పరిమితమైంది. అట్టడుగు స్థాయి వరకూ పాలన అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించడంతో ఇది సాధ్యమైందన్నారు. నిర్ణయాత్మక చర్యల కారణంగా నక్సలిజం అడవుల నుంచి క్రమంగా నిర్మూలించబడింది. కానీ ఇది కొత్త సవాలు సూచిస్తోంది. పట్టణ ప్రాంతాల్లోకి దాని మూలాలను విస్తరించడం ప్రారంభించింది అని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ ప్రజల ఆకాంక్షలను అణచివేసిందన్నారు. ఆ పార్టీ నుంచి ప్రజలు కూడా పెద్దగా ఆశించడంలేదన్నారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దశాబ్ద కాలంలో ప్రజల ఆకాంక్షలు పెరుగుతున్నాయన్నారు. భారత్ ప్రపంచ వృద్ధిని నడిపిస్తోందని మోదీ పేర్కొన్నారు.

# నిన్ను రెండుసార్లు ముఖ్యమంత్రిని చేశా
## నితీశ్‌పై తేజస్వి కౌంటర్ ఎటాక్

**మహా:** బీహార్ సీఎం నితీశ్ కుమార్, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు తారాస్థాయికి చేరాయి. తాజాగా సీఎం నితీశ్ కుమార్‌పై తేజస్వి యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నితీశ్‌ను తాను రెండుసార్లు ముఖ్యమంత్రిని చేశానంటూ వ్యాఖ్యానించారు. ఇటీవల బీహార్ అసెంబ్లీలో నితీశ్ సర్కారు బీహార్‌కు ఏం చేసిందని తేజస్వి ప్రశ్నిస్తే.. నీ తండ్రిని నాయకుడిని చేసిందే నేనని నితీశ్ కౌంటర్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై తేజస్వి యాదవ్ బుధవారం స్పందించారు. జేడీ(యూ) చీఫ్ నితీశ్‌కు రెండుసార్లు రాష్ట్రంలో అత్యున్నత పదవిని దక్కించుకోవడానికి తానే సాయం చేసినట్లు చెప్పారు. చిక్కుల్లో పడ్డ ఆయన పార్టీని తానే ఆదుకున్నానని వ్యాఖ్యానించారు.



# విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు 100% సాయం అందించండి
## కేంద్రమంత్రి ఖట్టర్ తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భేటీ



**మహా:** కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీలో కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులపై సిఎం... కేంద్రమంత్రితో చర్చించారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులపై మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి, పట్టణాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్టులు కీలకమైనవి. ఈ ప్రాజెక్టులను వెంటనే ఆమోదించి, ఆర్థిక సాయం అందించండి. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, పట్టణీకరణ సవాళ్లను పరిష్కరించడంలో ఈ ప్రాజెక్టుల ప్రాముఖ్యతను వివరిస్తూ ఒక నోట్ ను కేంద్రమంత్రికి సమర్పించారు. రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్ మెట్రో రైలు ఆమోదించారు. విశాఖపట్నం, విజయవాడ ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని సిఎం తెలిపారు. కీలక పారిశ్రామిక కేంద్రమైన విశాఖపట్నంలో రోజురోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తికానుందున, అప్పట్లోగా మెట్రో కారిడార్‌ను జాతీయ రహదారులతో అనుసంధానించడం చాలా ముఖ్యం. మొదటి దశలో ప్రధాన పట్టణ కేంద్రాలను అనుసంధానించడం లక్ష్యం. తర్వాత విమానాశ్రయం వరకు విస్తరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. రాజధాని అమరావతికి గేట్ వే గా విజయవాడ మెట్రో వ్యవస్థ ఏర్పాటుతో ప్రాంతీయ కనెక్టివిటీని బలోపేతం చేయాలని నిర్ణయించాం. విజయవాడ పరిసరాల్లో ఆర్థిక వృద్ధికి తోడ్పడటానికి ఇది చాలా అవసరం. నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చడానికి ఈ ప్రాజెక్టును ప్రాధాన్యమైనదిగా పరిగణించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర విభజన తర్వాత ఆర్థిక ఇబ్బందులను ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటోంది... మెట్రో ప్రాజెక్టులను స్వతహాగా నిర్మించే పరిస్థితుల్లో లేదు. రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన ఈ రెండు మెట్రో రైలు ప్రాజెక్టులకు 100% కేంద్ర సహాయాన్ని అందించాల్సిందిగా సిఎం కోరారు. సకాలంలో ప్రాజెక్టును గ్రౌండ్ చేసేందుకు ఫేజ్ 1 అనుమతులు, భూసేకరణకు కేంద్రం మద్దతు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. ఈ ప్రాజెక్టులు వల్ల వాయు కాలుష్యం తగ్గడమేగాక, ట్రాఫిక్ సమస్య పరిష్కారమై దీర్ఘకాలిక ఆర్థికవృద్ధికి దోహదపడుతుందని కేంద్రమంత్రి ఖట్టర్ కు సిఎం చంద్రబాబు వివరించారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 07-03-2025
ANN తెలుగు



# మహేశ్ వల్లే సినిమాలకు దూరమైన నమ్రత.. రిలేషన్‌లో ఉన్నప్పుడు..

అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ హీరోలు హీరోయిన్లను పెళ్లాడడం జరుగుతూనే ఉంది. అయితే గతంలో పెళ్లి తర్వాత హీరోయిన్లు తప్పనిసరిగా తమ నటన కెరీర్‌ను త్యాగం చేయాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదు. పెళ్లి తర్వాత కూడా టాప్ హీరోయిన్లుగా కొనసాగుతున్నారు. అయితే మహేశ్‌బాబును పాతికేళ్ల క్రితం వివాహం చేసుకున్న అప్పటి స్టార్ హీరోయిన్ నమ్రత మాత్రం నటనను వదిలేసుకున్నారు. మరి ఇప్పటి పరిస్థితిని చూసి ఆమె ఎలా ఫీల్ అవుతున్నారు?

**అందాల కిరీటం అందుకున్న నమ్రత**

ఎందుకంటే అప్పట్లో అందాల కిరీటం అందుకోవడం అంటే సాధారణ విషయం కాదు. దేశంలోని అతిపెద్ద బ్యూటీ కాంటెస్ట్... మిస్ ఇండియా టైటిల్ గెలిస్తే ఎకాఎకిన సినిమాల్లోకి వచ్చేసినట్టే. ప్రస్తుతం మహేశ్‌బాబు సతీమణిగా గ్లామర్ రంగానికి దూరంగా ఉన్న నమ్రత శిరోద్కర్ తొలిసారిగా 1993లో ఫెమినా మిస్ ఇండియాగా కిరీటాన్ని పొందిన ఘనత దక్కించుకుంది. దాంతో అప్పటి బాలీవుడ్ టాప్ హీరో సంజయ్ దత్, మళయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి సరసన నటించేందుకు వరుస అవకాశాలు వచ్చాయి.

**అప్పుడు హీరోయిన్‌గా.. ఇప్పుడు ఇల్లాలిగా..**

మెగాస్టార్ చిరంజీవితో కూడా నమ్రత నటించింది. తన సినీరంగ ప్రవేశం జరిగి మూడు దశాబ్ధాల తర్వాత... ప్రస్తుతం ఆమె టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్‌బాబు భార్యగా చక్కని సంతృప్తికరమైన కుటుంబ జీవితాన్ని గడుపుతోంది. ఇప్పుడు తెర వెనుక పూర్తి జీవితాన్ని అనుభవిస్తోంది మాజీ నటి నమ్రతా శిరోద్కర్. ఆమె 1998లో హిందీ 'ఎల్‌ఎమ్ జబ్ ప్యార్ కిసీసే హోతా హై'తో సినిమాల్లోకి అరంగేట్రం చేసింది. నమ్రత కెరీర్.. హిందీ, కన్నడ, తెలుగు, మరాఠీ, మలయాళంతో సహా పలు భాషల్లో విస్తరించింది. ఆమె హీరో హిందుస్తానీ, పుకార్, అస్తిత్వ, దిల్ విల్ ప్యార్ వ్యార్, తెహసీబ్, ఇన్సాఫ్: ది జస్టిస్ వంటి అనేక రకాల టాప్ మూవీస్‌లో నటించింది.

**వంశీ సినిమాతో మొదలు..**

ఎజుపున్న తారకన్ చిత్రం ద్వారా ఆమె మలయాళ ప్రేక్షకులకు సుపరిచితురాలైంది. అదే క్రమంలో 2000లో మహేశ్‌బాబు ప్రధాన పాత్రలో నటించిన వంశీతో టాలీవుడ్‌లో అరంగేట్రం చేసింది. వంశీ సినిమా ద్వారానే వారిద్దరూ సన్నిహితంగా మారారు. ఆ సినిమా షూటింగ్ కోసం 52 రోజుల పాటు న్యూజిలాండ్‌లో గడిపారు. అక్కడ ఇద్దరూ ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్నారు. వారి స్నేహం చివరికి ప్రేమగా మారింది. వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

**పెళ్లికి ముందే కండీషన్**

అయితే ఆ సమయంలో మహేశ్ కుటుంబం నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ముఖ్యంగా నమ్రత మహేశ్ కంటే వయసులో నాలుగేళ్లు పెద్దది కావడం, హిందీ చిత్రసీమకు చెందిన సినీనటిని కోడలిగా తెచ్చుకోవడానికి ఇష్టపడకపోవడం చిక్కులు తెచ్చిపెట్టింది. చివరికి, వారు అన్ని అడ్డంకులను అధిగమించి 2005లో పెళ్లి చేసుకున్నారు. పెళ్లయ్యాక మహేశ్‌బాబు నటనకు స్వస్తి చెప్పాలని కోరడంతో పెళ్లికి ముందే నమ్రత తన కమిట్మెంట్స్ అన్నీ పూర్తి చేసుకుంది. ఆ తర్వాత నమ్రత పలు ఇంటర్వ్యూలలో మాట్లాడినప్పుడు ఆ విషయం వెల్లడైంది.

## రిలేషన్‌లో ఉన్నప్పుడే..

తామిద్దరూ రిలేషన్‌షిప్ ఉన్నప్పుడే మహేశ్ తనకు ఈ విషయాన్ని చెప్పాడని నమ్రత అంటోంది. నటించడం నచ్చక లేదా నటిగా కొనసాగడం నచ్చకే మహేష్ అలా అన్నాడా? అంటే 'అదేమీ కాదు. 'మహేశ్‌కు ఇంటిని దిద్దుకునే భార్య కావాలి. నేను వేరే ఏదైనా ఉద్యోగంలో ఉండి ఉంటే కూడా అతను నన్ను ఆ జాబ్ వదిలేయమని అడిగేవాడు" అనేది నమ్రత సమాధానం. ఒకవేళ తాను సినిమాల్లో కొనసాగి ఉంటే మరింత అగ్రస్థానంలో ఉండేదేమో కదా! అని ఎవరైనా అంటే.. "నాకెప్పుడూ కూడా టాప్ హీరోయిన్‌ని కావాలనే కోరిక లేదు, కాబట్టి నేను నటించడం మానేయాల్సి వచ్చినప్పుడు, ఏ మాత్రం నిరాశ చెందలేదు.' అని నమ్రత స్పష్టం చేసింది.

# బన్నీ నెక్స్ట్ మూవీకి ఏంటి సమస్య?



'పుష్ప 2' వచ్చి మూడు నెలలు దాటేసింది. అల్లు అర్జున్ ఇప్పుడు ఏ సినిమా.. ఎవరితో చేస్తాడనేది మాత్రం ఇంకా సస్పెన్స్ గానే ఉంది. ఎందుకంటే ఇద్దరి డైరెక్టర్ల పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. అసలింతకీ ఏంటి సమస్య? ఎవరితో ఫస్ట్ చేయొచ్చు?

అల్లు అర్జున్ తో సినిమాలు చేసేందుకు చాలామంది దర్శకులు రెడీగా ఉన్నారు కానీ ఇదివరకే త్రివిక్రమ్ తో సినిమా చేసేందుకు బన్నీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. పీరియాడిక్ సెటప్ ఉన్న కథ కావడంతో ప్రీ ప్రొడక్షన్ కే చాలా టైమ్ పట్టేలా ఉంది. నిర్మాత నాగవంశీ.. రీసెంట్ గానే మాట్లాడుతూ ఈ ఏడాది ద్వితియార్థంలో ప్రాజెక్ట్ మొదలవుతుందని క్లారిటీ ఇచ్చారు. అంటే మరో ఆరేడు నెలలు బన్నీ ఖాళీగానే ఉంటాడు. మరోవైపు అల్లు అర్జున్.. తమిళ డైరెక్టర్ అట్లీతో సినిమా చేసేందుకు రెడీగా ఉన్నాడని ఇండస్ట్రీలో టాక్. కాకపోతే బడ్జెట్‌రెమ్యునరేషన్ దగ్గరే చిక్కంతా వచ్చి పడిందని తెలుస్తోంది. రూ.600 కోట్ల బడ్జెట్ కాగా.. పారితోషికం కింద తనకే రూ.100 కోట్లు ఇవ్వాలని అట్లీ అంటున్నాడట. ఈ పాయింట్ దగ్గరే డిష్కసన్స్ నడుస్తున్నాయని, ఏదో ఒక విషయం తేలితో త్వరలో బన్నీఅట్లీ కాంబోపై క్లారిటీ వస్తుందని టాక్. అట్లీ ప్రాజెక్ట్ ఓకే అయితే మాత్రం త్రివిక్రమ్ తో చేయాల్సిన సినిమా వచ్చే ఏడాదే మొదలవుతుంది. లేదంటే మాత్రం ఈ ఏడాది చివర్లో షురూ చేసేస్తారు. మరి బన్నీ ఏం చేస్తాడనేది చూడాలి?





## బంగారాన్ని బహుమతిగా ఇచ్చేసిన నటి.. నోరెళ్లబెట్టిన కూతురు

ఎవరైనా మీ ఇయర్ రింగ్స్ బాగున్నాయనో, బ్యాగు బాగుందనో, నెక్లెస్ బాగుందనో చెప్తే థాంక్స్ అంటూ సంతోషిస్తారు. కానీ ఈ బాలీవుడ్ నటి మాత్రం బంగారు దిద్దులు బాగున్నాయన్నందుకు ఏకంగా వాటినే తీసి బహుమతిగా ఇచ్చేసింది. ఇంతకీ ఆ నటి ఎవరో కాదు ఒకప్పటి హీరోయిన్ రవీనా టండన్. రవీనా తన కూతురు రాషా తడానీతో కలిసి ముంబై ఎయిర్‌పోర్టులో బుధవారం సాయంత్రం ప్రత్యక్షమైంది. ఆమె కనిపించగానే ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు తనను వెంబడిస్తూ కెమెరాలో రికార్డు చేస్తున్నారు. బంగారు కమ్మ బహుమతిగా.. వారిలో ఒకరు రవీనాను తన చెవిదిద్దులు బాగున్నాయని పొగిడాడు. దాంతో రవీనా ఏ కమ్మ బాగుందని అడుగుతూ దాన్ని తీసేసింది. తనకు కాంప్లిమెంట్ ఇచ్చిన వ్యక్తిని ఆ బంగారు దిద్దును బహుమతిగా ఇచ్చేసింది. ఇదంతా చూసిన రాహా.. తల్లి చేసిన పనికి నోరెళ్లబెట్టింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రవీనా మనసు బంగారం.. ఈ రోజుల్లో బంగారాన్ని దానం చేసే మహానుభావులు ఎవరున్నారు? వావ్, మంచి మనసున్నవాళ్లకే ఇలాంటివి సాధ్యమవుతాయి.. తను నిజంగా గ్రేట్ అని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.



## జాన్వీ బర్త్ డే స్పెషల్.. లుక్ అదిరిందిగా!

దివంగత నటి శ్రీదేవి పెద్దకూతురు జాన్వీ కపూర్ (Janhvi Kapoor) దేవర సినిమాతో తెలుగువారికి పరిచయమైంది. తంగంగా తన మాటలు, యాక్టింగ్‌తో అందరి మనసులు గెలుచుకుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ రామ్‌చరణ్‌తో కలిసి #RC16 మూవీలో నటిస్తోంది. నేడు (మార్చి 6) జాన్వీ కపూర్ బర్త్‌డే. ఈ సందర్భంగా RC16 చిత్రబృందం జాన్వీ ఫస్ట్ లుక్ రిలీజ్ చేసింది. ఈ పోస్టర్‌లో జాన్వీ గొర్రెలమంద ముందు నిల్చుంది. కుడిచేత్తో పొట్టేలు పిల్లను చేతిలో పెట్టుకుని మరో చేత్తో గడ్డిపోచలు పట్టుకుంది. ఈ పోస్టర్‌ను చరణ్ ట్విటర్‌లో షేర్ చేశాడు. హ్యాపీ బర్త్‌డే జాన్వీ కపూర్. నువ్వు ఎప్పుడూ సంతోషంగా ఉండాలి. ఎల్లప్పుడూ విజయాలను అందుకోవాలి అని ఆకాంక్షించారు. జాన్వీ లుక్ చూసిన జనాలు బాగుందని కామెంట్లు చేస్తున్నారు. బుచ్చిబాబు, చరణ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. శివరాజ్‌కుమార్ ముఖ్యపాత్రలో మెరవనున్నారు.

# క్రీడా వార్తలు | SPORTS NEWS

# ఏప్రిల్, మే నెలల్లో ట్రై సిరీస్ ఆడనున్న భారత్




**మహా:** ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో శ్రీలంకలో మహిళల ముక్కోణపు వన్డే టోర్నీ జరుగనుంది. ఈ టోర్నీలో శ్రీలంక సహా భారత్, సౌతాఫ్రికా జట్లు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీ డబుల్ రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో జరుగుతుంది. ప్రతి జట్టు నాలుగు గ్రూప్ స్టేజీ మ్యాచ్‌లు ఆడుతుంది. గ్రూప్ మ్యాచ్‌ల అనంతరం మొదటి రెండు స్థానాల్లో నిలిచే జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలో అన్ని మ్యాచ్‌లకు కొలొంబోని ప్రేమదాస స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. మ్యాచ్‌లన్నీ డే మ్యాచ్‌లుగా జరుగుతాయి. ఏప్రిల్ 27న జరిగే టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు టీమిండియాతో తలపడనుంది. మే 11న ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. ఈ టోర్నీ ఈ ఏడాది చివర్లో భారత్‌లో జరిగే వన్డే వరల్డ్‌కప్‌కు సన్నాహకంగా ఉపయోగపడుతుంది. ఈ టోర్నీలో పాల్గొనే మూడు జట్లు ఇదివరకే వరల్డ్‌కప్‌కు అర్హత సాధించాయి.

**ముక్కోణపు సిరీస్ షెడ్యూల్**

ఏప్రిల్ 27 భారత్ వర్సెస్ శ్రీలంక
ఏప్రిల్ 29 భారత్ వర్సెస్ సౌతాఫ్రికా
మే 1 శ్రీలంక వర్సెస్ సౌతాఫ్రికా
మే 4 భారత్ వర్సెస్ శ్రీలంక
మే 6 భారత్ వర్సెస్ సౌతాఫ్రికా
మే 8 సౌతాఫ్రికా వర్సెస్ శ్రీలంక
మే 11 ఫైనల్

కాగా, భారత్ ఈ ఏడాది ఆరంభంలో స్వదేశంలో ఐర్లాండ్‌తో వన్డే సిరీస్ ఆడింది. ఈ సిరీస్‌లో భారత్ జయకేతనం ఎగురవేసింది. గతేడాది చివర్లో సౌతాఫ్రికా మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఇంగ్లండ్‌కు ఆతిథ్యమిచ్చింది. ఈ సిరీస్‌ను సౌతాఫ్రికా 12 తేడాతో కోల్పోయింది. శ్రీలంక విషయానికొస్తే.. ఈ జట్టు ప్రస్తుతం న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడుతుంది. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. మహిళల క్రికెట్ విషయానికొస్తే.. ప్రస్తుతం భారత్‌లో డబ్ల్యూపీఎల్ మూడో సీజన్ జరుగుతుంది. ఈ లీగ్ చివరి దశకు చేరింది. 15 మ్యాచ్‌లు అయిపోయే సరికి ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఢిల్లీ ఆడిన 7 మ్యాచ్‌ల్లో ఐదింట విజయాలు సాధించి ప్లే ఆఫ్స్‌కు కూడా అర్హత సాధించింది. గత రెండు సీజన్లలో చివరి స్థానంలో నిలిచిన గుజరాత్ ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. గతేడాది రన్నరప్ ముంబై ఇండియన్స్ మూడులో, ఢిఫెండింగ్ చాంపియన్ ఆర్సీబీ నాలుగో స్థానంలో, యూపీ వారియర్జ్ ఐదో స్థానంలో ఉన్నాయి. లీగ్‌లో భాగంగా ఇవాళ (మార్చి 6) యూపీ వారియర్జ్, ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది.

## ఐదేసిన అమేలియా కెర్.. నామమాత్రపు స్కోర్‌కే పరిమితమైన వారియర్జ్



డబ్ల్యూపీఎల్ 2025లో భాగంగా లక్నో వేదికగా ఇవాళ (మార్చి 6) యూపీ వారియర్జ్, ముంబై ఇండియన్స్ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ చేసిన ముంబై ఇండియన్స్ యూపీ వారియర్జ్‌ను నామమాత్రపు స్కోర్‌కే పరిమితం చేసింది. అమేలియా కెర్ ఐదు వికెట్లతో విజృంభించడంతో వారియర్జ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు మాత్రమే చేయగలిగింది.

వారియర్జ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ జార్జియా వాల్ (55) అర్ధ సెంచరీతో రాణించగా.. గ్రేస్ హ్యారిస్ (28), కెప్టెన్ దీప్తి శర్మ (27), వృందా దినేశ్ (10), ఆఖర్లో సోఫీ ఎక్లెస్టోన్ (16) రెండంకెల స్కోర్లు చేశారు. కిరణ్ నవ్‌గిరే, శ్వేతా సెహ్రావత్ డకౌట్లు కాగా.. చినెల్ హెన్రీ 6, ఉమా ఛెత్రీ ఒక పరుగు చేశారు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో అమేలియా కెర్‌తో పాటు హేలీ మాథ్యూస్ (2), నాట్ సీవర్ బ్రంట్ (1), పరుణిక సిసోడియా (1) వికెట్లు తీశారు. వారియర్జ్ ఇన్నింగ్స్‌కు ఓపెనర్లు గ్రేస్ హ్యారిస్, జార్జియా వాల్ గట్టి పునాది వేశారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 74 పరుగులు (8 ఓవర్లలో) జోడించారు. హ్యారిస్, వాల్ క్రీజ్‌లో ఉండగా.. వారియర్జ్ భారీ స్కోర్ సాధిస్తుందని అంతా భావించారు. అయితే 16 పరుగుల వ్యవధిలో వీరిద్దరూ ఔట్ కావడంతో వారియర్జ్ కష్టాల్లో పడింది. హ్యారిస్, వాల్ ఔటయ్యాక వారియర్జ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి భారీ స్కోర్ చేయలేకపోయింది. సెకండ్ డౌన్‌లో వచ్చిన దీప్తి శర్మ చివరి ఓవర్ వరకు క్రీజ్‌లో ఉన్నప్పటికీ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఆఖర్లో ఎక్లెస్టోన్ ఓ మోస్తరుగా బ్యాట్‌ను ఝులిపించడంతో వారియర్జ్ ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. ఈ సీజన్‌లో వారియర్జ్ ఆశించిన స్థాయిలో రాణించలేక పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో ఉంది. ఈ జట్టు ఇప్పటివరకు ఆడిన 6 మ్యాచ్‌ల్లో 2 మ్యాచ్‌ల్లో మాత్రమే గెలుపొందింది. ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఢిల్లీ ఆడిన 7 మ్యాచ్‌ల్లో ఐదింట విజయాలు సాధించి ప్లే ఆఫ్స్‌కు కూడా అర్హత సాధించింది. గత రెండు సీజన్లలో చివరి స్థానంలో నిలిచిన గుజరాత్ ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. గతేడాది రన్నరప్ ముంబై ఇండియన్స్ మూడులో, ఢిఫెండింగ్ చాంపియన్ ఆర్సీబీ నాలుగో స్థానంలో ఉన్నాయి. నేటి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ గెలిస్తే పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరుకుని ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంటుంది.

# ఫైనల్ మ్యాచ్‌కు అంపైర్లు వీరే..!



ఛాంపియన్స్ ట్రోఫీ2025 ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించబోయే అంపైర్ల పేర్లను ఐసీసీ ఇవాళ (మార్చి 6) ప్రకటించింది. ఈ మ్యాచ్ కోసం ఐసీసీ అనుభవజ్ఞులైన మ్యాచ్ అఫీషియల్‌స్‌ను ఎంపిక చేసింది. ఈ మ్యాచ్‌లో ఆన్ ఫీల్డ్ అంపైర్లుగా పాల్ రీఫిల్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ వ్యవహరించనున్నారు. థర్డ్ అంపైర్‌గా జోయల్ విల్సన్ విధులు నిర్వహించనున్నాడు. ఫోర్త్ అంపైర్‌గా కుమార ధర్మసేన.. మ్యాచ్ రిఫరీగా రంజన్ మదుగలే వ్యవహరించనున్నారు. ఫైనల్ మ్యాచ్ అంపైర్లలో పాల్ రీఫిల్ సౌతాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరిగిన రెండో సెమీస్‌లో ఫీల్డ్ అంపైర్‌గా వ్యవహరించగా.. ఇల్లింగ్‌వర్త్, భారత్‌ఆస్ట్రేలియా మధ్య జరిగిన తొలి సెమీఫైనల్‌కు ఫీల్డ్ అంపైర్‌గా వ్యవహరించాడు. నాలుగు సార్లు ఐసీసీ అంపైర్ ఆఫ్ ద ఇయర్‌గా నిలిచిన ఇల్లింగ్‌వర్త్.. 2023 వన్డే వరల్డ్‌కప్, 2024 టీ20 వరల్డ్‌కప్ ఫైనల్స్‌లోనూ ఫీల్డ్ అంపైర్‌గా వ్యవహరించాడు. ఇల్లింగ్‌వర్త్.. భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన గ్రూప్ స్టేజీ మ్యాచ్‌కు కూడా ఫీల్డ్ అంపైర్‌గా వ్యవహరించాడు. కాగా, ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ జట్లు తలపడనున్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ దుబాయ్ వేదికగా మార్చి 9న జరుగనుంది. ఈ మ్యాచ్ భారతకాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమవుతుంది. భారత్ తొలి సెమీఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించి ఫైనల్‌కు చేరగా.. న్యూజిలాండ్ రెండో సెమీస్‌లో సౌతాఫ్రికాను చిత్తు చేసి తుది పోరుకు అర్హత సాధించింది. ఇదిలా ఉంటే, ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ తలపడటం ఇది రెండో సారి. 2000 ఎడిషన్‌లో ఇరు జట్లు ఎదురెదురుపడగా.. న్యూజిలాండ్ భారత్‌ను ఓడించి తమ తొలి ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ ఇరు జట్లు ఇనాగురల్ డబ్ల్యూటీసీ ఫైనల్లో (20192021) రెండో సారి తలపడ్డాయి. ఈసారి కూడా న్యూజిలాండ్ భారత్‌ను ఓడించి తమ రెండో ఐసీసీ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. న్యూజిలాండ్, తాము గెలిచిన రెండు ఐసీసీ టైటిళ్లను భారత్‌పైనే గెలవడం విశేషం.

# ఐపీఎల్ ప్రారంభానికి ముందు ఆర్సీబీకి శుభవార్త

2025 ఐపీఎల్ సీజన్ ప్రారంభానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు శుభవార్త అందింది. ఈ ఏడాది ఐపీఎల్‌కు దూరమవుతాడనుకున్న జేకబ్ బేతెల్ (ఇంగ్లండ్ ఆటగాడు) గాయం నుంచి పూర్తిగా కోలుకున్నట్లు తెలుస్తుంది. బేతెల్ మొదటి మ్యాచ్ నుంచే అందుబాటులో ఉంటాడని సమాచారం. బేతెల్.. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్ సందర్భంగా గాయపడిన విషయం తెలిసిందే. చిన్న వయసులోనే అద్భుతమైన స్ట్రోక్ ప్లేయర్‌గా గుర్తుంపు తెచ్చుకున్న బేతెల్‌ను ఆర్సీబీ గతేడాది మెగా వేలంలో రూ.2.6 కోట్లు వెచ్చించి సొంతం చేసుకుంది. బేతెల్ మిడిలార్డర్‌లో విధ్వంకర బ్యాటింగ్ చేయడంతో పాటు ఉపయోగకరమైన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలింగ్ చేస్తాడు. బేతెల్ ఇప్పటివరకు 63 టీ20లు ఆడి 136.77 స్ట్రయిక్‌రేట్‌తో 1127 పరుగులు చేశాడు. గతేడాది చివర్లో ఇంగ్లండ్ తరఫున అరంగేట్రం చేసిన బేతెల్ 3 టెస్ట్‌లు, 9 వన్డేలు, 10 టీ20లు ఆడాడు. బేతెల్ టెస్ట్‌ల్లో 3, వన్డేల్లో 2, టీ20ల్లో 2 హాఫ్ సెంచరీలు చేశాడు. బేతెల్ మొత్తంగా అంతర్జాతీయ కెరీర్‌లో 674 పరుగులు చేశాడు. ఐదు వికెట్లు పడగొట్టాడు. 21 ఏళ్ల బేతెల్‌కు ఇది తొలి ఐపీఎల్ అవుతుంది. ఆర్సీబీ.. మార్చి 22న కోల్‌కతాలో జరిగే లీగ్ ఓపెనింగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కేకేఆర్‌తో తలపడుతుంది. ఈ ఏడాదే ఆర్సీబీ నూతన కెప్టెన్‌గా మధ్యప్రదేశ్ ఆటగాడు రజత్ పాటిదార్ ఎంపికయ్యాడు.

**ఈ ఏడాది ఆర్సీబీ జట్టు..**

రజత్ పాటిదార్ (కెప్టెన్), విరాట్ కోహ్లి, దేవ్‌దత్ పడిక్కల్, టిమ్ డేవిడ్,స్వస్థిక్ చికార, కృనాల్ పాండ్యా, లియామ్ లివింగ్‌స్టోన్, మనోజ్ భాండగే, జేకబ్ బేతెల్, రొమారియో షెపర్డ్, స్వప్నిల్ సింగ్, మోహిత్ రతీ, ఫిలిప్ సాల్ట్, జితేశ్ శర్మ, జోష్ హాజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్, లుంగి ఎంగిడి, రసిక్ దార్ సలామ్, సుయాశ్ శర్మ, యశ్ దయాల్, నువాన్ తుషార, అభినందన్ సింగ్

**ఐపీఎల్ 2025లో ఆర్సీబీ షెడ్యూల్**

మార్చి 22 కేకేఆర్‌తో.., మార్చి 28 సీఎస్‌కే
ఏప్రిల్ 2 గుజరాత్, ఏప్రిల్ 7 ముంబై
ఏప్రిల్ 10 ఢిల్లీ, ఏప్రిల్ 13 రాజస్థాన్
ఏప్రిల్ 18 పంజాబ్, ఏప్రిల్ 20 పంజాబ్
ఏప్రిల్ 24 రాజస్థాన్, ఏప్రిల్ 27 ఢిల్లీ
మే 3 సీఎస్‌కే, మే 9 లక్నో
మే 13 సన్‌రైజర్స్, మే 17 కేకేఆర్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com